ఫేవరెట్‌గా టీమిండియా..

- గత రెండు బాక్సింగ్ డే టెస్ట్‌ల్లోనూ గెలుపే
- తనుష్ కోటియన్‌కు పిలుపు

8

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 142 | విజయవాడ, మంగళవారం 24 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 24 December 2024 | Rs

రక్షిత్ ఫార్మాలో విషవాయువు లీక్

- ఇద్దరు కార్మికులకు అస్వస్థత

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)

పరవాడ మండలంలోని రాంకీ ఫార్మా సిటీలో రక్షిత్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం విషవాయువు లీకవడంతో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం తెల్లవారుజామున 5:30 గంటలకు ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న ఒడిశాకు చెందిన దేవ్ బాగ్, ఉగ్రేస్ అస్వస్థతకు గురయ్యారు. వారిని విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బాధితులను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పరామర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రమాదంపై ఆరా తీసినట్టు చెప్పారు. ప్రమాద స్థలాన్ని జిల్లా పరిశ్రమల అధికారి నాగ రాజారావు తదితరులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఘటనపై అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ స్పందిస్తూ అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

అమరావతి ఆదాయంతో అప్పులు చెల్లిస్తాం

పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ • కొత్తగా రూ.2,723 కోట్ల విలువైన పనులకు ఆమోదం

రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ)పై అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో మంత్రి నారాయణ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఎడిబి నుండి తీసుకుంటున్న రుణాన్ని అమరావతి నగరం నుండి వచ్చే ఆదాయంతో చెల్లిస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం ఉదయం రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ) 44వ సమావేశం జరిగింది. ఈ సమావేశ వివరాలను మీడియాకు వివరించిన మంత్రి నారాయణ రాజధాని నిర్మాణంకోసం తీసుకుంటున్న అప్పును, ఆ మొత్తం చెల్లింపు కోసం అనుసరించే విధానాలను తెలిపారు. అమరావతిలో విధించే పన్నులు, అక్కడున్న భూముల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో అప్పును తిరిగి చెల్లిస్తామని ఆయన వివరించారు. దీంతో ఇప్పటి వరకూ ప్రపంచ బ్యాంకు నిధులను కేంద్రం తీసుకుంటుందని, రాష్ట్రానికి ఎటువంటి సంబంధం లేదంటూ చెబుతూ వచ్చిన ప్రభుత్వ మాటల్లోని బండారం బట్టబయలైంది. వాస్తవానికి ప్రపంచబ్యాంకు రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుందని ప్రజాశక్తి గతంలోనే బయటపెట్టింది. ఇప్పుడు అదే విషయాన్ని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ స్వయంగా తెలిపారు. ఇక నుండి ప్రతివారం సమావేశం జరపాలని నిర్ణయించారు. రాజధాని పరిధిలోని ఏడు, పది జోన్లలో ఉన్న లేఅవుట్లలో రూ.2,723 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ప్రపంచబ్యాంకుకు ఇచ్చిన అంగీకారపత్రంలో ఈ రెండు లేఅవుట్ల అంశాన్ని పేర్కొన్నారు. కొత్తగా ఇచ్చిన అనుమతులతో కలిపి రాజధాని పరిధిలో ఇప్పటి వరకూ రూ.47,288 కోట్ల విలువైన పనులకు అథారిటీ ఆమోదం తెలిపినట్లయిందని మంత్రి చెప్పారు. వీటిలో భాగంగా నీరు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలతో 3600 భవనాలు, ఐదు ఐకానిక్ టవర్లు, 257 మీటర్ల ఎత్తుండే అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మిగిలిన టెండర్లు ఏమైనా ఉంటే వచ్చేనెలలో పూర్తి చేసి పనులు మొదలు పెడతామని పేర్కొన్నారు.

అమరావతి తరహాలో...

పోర్టులతోపాటు వాటి దగ్గర్లోని శాటిలైట్ సిటీలను అమరావతి మోడల్‌లో ల్యాండ్ పూలింగు ద్వారా అభివృద్ధి చేస్తామని చెప్పారు. దీనివల్ల రైతుల భూమి విలువ పెరుగుతుందని అన్నారు. వైసిపి నాయకులు ఏం మాట్లాడుతున్నారో తెలియదని నోటికి వచ్చిన స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని అన్నారు. డిసెంబర్ చివరి నాటికి మేజర్ టెండర్లు పూర్తి చేస్తామని అన్నారు.

జూన్ కల్లా 1.18 లక్షల టిడ్కో ఇళ్లు

2025 జూన్ కల్లా 1.18 లక్షల టిడ్కో ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఎన్‌పిఎగా మిగిలిపోయిన టిడ్కో గృహాలను పూర్తి చేయడానికి రూ.102 కోట్లను చెల్లించేందుకు సిఎం అంగీకరించారని చెప్పారు. 2014-19లో 7,01,481 ఇళ్లు అనుమతి వస్తే ఐదు లక్షల ఇళ్లకు పరిపాలనా ఆమోదం తెలిపామని, 4,54,706 ఇంటి పనులు ప్రారంభమయ్యాయని, 2019నాటికి 3,13,832 ఇళ్లు ప్రారభించామని చెప్పారు. అనంతరం వాటిని నిలిపేశారని తెలిపారు. పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ముఖ్యమంత్రి 26 జిల్లాలను సమానంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారని తెలిపారు.



సామాజిక వాస్తవాలను తెరకెక్కించిన సాహసోపేత చలనచిత్ర దిగ్గజం

శ్యామ్‌బెనెగల్ కన్నుమూత

- పలువురు ప్రముఖుల నివాళి

ముంబయి : భారతీయ సినిమాలో ఒక శకం ముగిసింది. ప్రముఖ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత సమాంతర సినిమా ఉద్యమ మార్గదర్శకులు శ్యామ్ బెనెగల్ సోమవారం కన్నుమూశారు. ఆయన వయస్సు 90 సంవత్సరాలు. గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధి, వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న శ్యామ్ బెనెగల్ ముంబయిలోని వోకార్డ్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం 6:38 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు వెల్లడించారు. శ్యామ్‌బెనెగల్‌కు భార్య నీరా బెనెగల్, కుమార్తె పియా బెనెగల్ ఉన్నారు. ఇటీవలే 90వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన శ్యామ్ బెనెగల్ రెండు, మూడు ప్రాజెక్టులు చేస్తున్నట్లు జన్మదినం సందర్భంలో వెల్లడించారు. శ్యామ్ బెనెగల్ 2006 నుంచి 2012 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1966 నుండి 1973 వరకు పూణే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో లెక్చరర్‌గా పనిచేశారు. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. సహ్యాద్రి ఫిల్మ్స్ బ్యానర్‌పై తన సొంత చిత్రాలను నిర్మించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

విస్తృతంగా పింఛన్ల తనిఖీ

- చంద్రబాబు ఆదేశం
- స్థానిక సంస్థల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులకు ఇస్తున్న సామాజిక పింఛన్లను విస్తృంగా తనిఖీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. బిసి సంక్షేమశాఖపై సచివాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనర్హులను తొలగించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగాలని చెప్పారు. అర్హులైన వారికే సాయం అందాలన్నది తమ విధానమని, అందుకే తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దివ్యాంగుల పింఛన్ల తనిఖీ కార్యక్రమాన్ని మూడునెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. తప్పుడు సర్టిఫికేట్లు ఇచ్చే డాక్టర్లు, అధికారులు, సిబ్బందిపై చర్యలకు వెనుకాడవద్దని అన్నారు. ఒకసారి తప్పుడు సర్టిఫికేట్ ఇస్తే ఎప్పుడైనా వారిపైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెప్పారు. తప్పుడు సర్టిఫికేట్లతో ప్రభుత్వాన్ని మోసం చేస్తే సహించేది లేదన్నారు. బిసిల రక్షణ చట్టం కోసం నియమించిన మంత్రుల కమిటీ ప్రాథమికంగా ఇచ్చిన సూచనలను అధికారులు ముఖ్యమంత్రికి ఈ సమావేశంలో వివరించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న హామీకి కట్టుబడి ఉన్నామని, దీనికి చట్టబద్ధత కూడా చేస్తామని తెలిపారు.

బిసి సంక్షేమ హాస్టళ్లకు తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. రాష్ట్రవిభజన తరువాత ఉమ్మడి జిల్లాల ఆధారంగా మంజూరు చేసిన 13 బిసి భవనాల్లో మూడు మాత్రమే నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన వాటికి భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి సామాజిక వర్గానికి కో-ఆపరేటివ్ ఫైనాన్స్ సొసైటీ ఏర్పాటు చేసి ఆయా వర్గాలను బలోపేతం చేసేందుకు పనిచేయాలని చెప్పారు. రాష్ట్రంలో త్వరలో ఎస్ఆర్ శంకరన్ నాలెడ్జ్ సెంటర్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్కిల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, సోషల్ ఎమోషనల్ స్కిల్స్, నైతిక విలువలు, నీతిశాస్త్రం, డిజిటల్ లిటరసీ, లీగల్ అవేర్నెస్ వంటివి ఈ సెంటర్ల ద్వారా విద్యార్థులకు అందించాలని చెప్పారు. 26 జిల్లాల్లోని 104 బిసి హాస్టళ్లలో పైలట్ ప్రాజెక్టులుగా దీనిని అమలు చేయనున్నారు. ఈ సమీక్షలో బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జి వి.రామసుబ్రమణ్యం

న్యూఢిల్లీ : జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నూతన చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జి వి రామసుబ్రమణ్యంను నియమించారు. జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా జూన్‌లో పదవీవిరమణ చేసినప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉన్న సంగతి తెలిసిందే. మిశ్రా తరువాత ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులు విజయ భారతి సయాని తాత్కాలిక చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చైర్‌పర్సన్‌గా రామసుబ్రమణ్యంను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించినట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సి సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులుగా ప్రియాంక్ కనోంగో, డా. జస్టిస్ (రిటైర్డ్) బిద్యుత్ రంజన్ సరంగిలను నియమించినట్లు తెలిపింది. ప్రధానమంత్రి నేతృత్వంలో గత వారం జరిగిన ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. హోంమంత్రి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్‌తో పాటు లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీ, మలికార్జున ఖర్గే కూడా పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా కోరుతూ

30న దేశవ్యాపితంగా నిరసనలు

- వామపక్షాల సంయుక్త ప్రకటన
- జమిలి ఎన్నికల ప్రతిపాదన సమాఖ్య వ్యవస్థపై వేటు

ఢిల్లీలో సమావేశమైన వామపక్షాల నేతలు ప్రకాశ్‌కరత్, రాజా, దీపాంకర్, మనోజ్, దేవరాజన్, బివి రాఘవులు

న్యూఢిల్లీ : భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్ఠాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా కోరుతూ ఈ నెల 30న దేశవ్యాపితంగా నిరసనలకు అయిదు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఆ వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్ షా గానీ ప్రధాని నరేంద్ర మోడీ గానీ ఇందుకు బాధ్యత వహించడానికి కానీ, దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు కానీ సిద్ధపడకపోవడం దారుణమని వ్యాఖ్యానించాయి. ఈ పరిస్థితుల్లో నిరసనలను కొనసాగించాలని లెఫ్ట్ పార్టీలు భావించాయి. డిసెంబరు 30న జాతీయ నిరసన దినాన్ని పాటించాలని వామపక్షాలు సంయుక్తంగా నిర్ణయించాయి. హోం మంత్రిగా అమిత్ షా రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను అవి పునరుద్ఘాటించాయి. సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్ నేతలు ఆదివారం ఇక్కడ సమావేశమై అమిత్ షా అంశం, జమిలి ఎన్నికలు సహా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సిపిఎం పొలిట్‌బ్యూరో కో ఆర్డినేటర్ ప్రకాశ్ కరత్, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ ఈ సంయుక్త ప్రకటనను మీడియాకు విడుదలజేశారు.

జమిలి ఎన్నికలు : ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదంపై దాడి

ఒక దేశం, ఒక ఎన్నిక ప్రతిపాదనను వామపక్షాలు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాయి. ఇందుకోసం రాజ్యాంగ సవరణ బిల్లుతో సహా రెండు బిల్లులను ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. రాజ్యాంగానికి ప్రతిపాదించిన సవరణలు సమాఖ్య వ్యవస్థపైన, రాష్ట్రాల శాసనసభలు, వాటిని ఎన్నుకున్న ప్రజల హక్కులపై నేరుగా దాడి చేయడమేనని వారు విమర్శించారు. శాసనసభల ఐదేళ్ళ కాలపరిమితిని ఏకపక్షంగా మిగతా 7లో

ఐదేళ్లలో సమగ్ర అమరావతి

ప్రజాశక్తితో సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగరాన్ని రానున్న ఐదేళ్లలో అభివృద్ధి చేస్తామని, అది నిరంతరం ప్రక్రియగా ఉంటుందని, సమగ్ర, సమ్మిళిత అమరావతి ధ్యేయంగా పనిచేస్తున్నామని సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ తెలిపారు. ప్రజాశక్తి న్యూస్ బ్యూరో చీఫ్ వల్లభనేని సురేష్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అమరావతి నిర్మాణానికి సంబంధించిన అనేక విషయాలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో విశ్వవ్యాప్త నగరంగా అమరావతి అభివృద్ధి చెందడానికి అన్ని అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఇంటర్వ్యూ వివరాలు :

ప్రశ్న : అమరావతి అభివృద్ధికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : ప్రతి రాష్ట్రానికి ఒక రాజధాని కావాలి. విభజన అనంతరం ఎపికి అమరావతిని రాజధానిగా ప్రకటించారు. ప్రపంచంలోని అన్ని నగరాలనూ పరిశీలించి ఒక సమగ్ర మాస్టర్‌ప్లాను తయారు చేశారు. కారణాలు ఏమైనా కొద్దికాలం పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం మరలా ప్రారంభం అయ్యాయి. ఇక్కడో విషయం గుర్తు పెట్టుకోవాలి. 2014లో అమరావతిని ప్రకటించిన సమయంలో కేవలం రూ.4,000 కోట్లతోనే ప్రారంభం అయ్యాం 2024లో ఇప్పుడు రూ.15 వేల కోట్లతో ప్రారంభిస్తున్నాం. కనుక పనులు వేగంగా జరుగుతాయనడంలో సందేహం లేదు. దీనిపై అథారిటీ ఎప్పటికప్పుడు సమీక్షలు చేసి అనుమతులు ఇస్తోంది. వాటికి అనుగుణంగా పనులు చేపడుతున్నాము.

ప్ర : ఏయే పనులు ప్రారంభిస్తున్నారు?

జ: ప్రభుత్వ కాంప్లెక్స్ సముదాయం, హైకోర్టు, అసెంబ్లీ, ఐకానిక్ టవర్లు, గతంలో నిలిచిపోయిన భవనాల పూర్తి, ఉన్నతాధికారుల, ఉద్యోగుల నివాస భవన సముదాయాలు అన్నిటినీ ప్రారంభిస్తాం. దీనికి టెండర్లనూ ఆహ్వానించాము. ప్రక్రియ ప్రారంభం అయింది. జనవరి నాటికి పూర్తి చేస్తాం. వెంటనే పనులూ ప్రారంభిచేస్తాము. కాలవ్యవధి ఆధారంగా పనులు పూర్తి చేస్తాము. వీటితోపాటు కరకట్ట విస్తరణ, రైతులకు తిరిగి ఇచ్చిన పూలింగు రిటర్న్ బుల్ ప్లాట్లలో సదుపాయాలు, రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ, విద్యుత్, గ్రీనరీ, కాలువలు, రిజర్వాయర్లు అన్నిపనులూ ఏకకాలంలో ప్రారంభం అవుతాయి. కొద్దికాలంలో ప్రజలతో అమరావతి కిటకిటలాడుతుంది.

ప్ర: కరకట్ట విస్తరణ ఎలా ఉండబోతోంది ?

జ : ప్రస్తుతం అమరావతికి వెళ్లడానికి కరకట్ట మార్గం కీలకంగా ఉంది. సీడ్ యాక్సెస్ రోడ్డు వెంకటపాలెం దగ్గర్లోని మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం వరకూ ఏర్పాటైంది. అక్కడ నుండి అనివార్య కారణాల వల్ల నిలిచిపోయింది. దానికి అనుబంధంగా ప్రస్తుతం ఉండవల్లిలోని పంపింగ్ స్టేషన్ నుండి కరకట్టను నాలుగులైన్లుగా అభివృద్ధి చేయాలని అంచనాలు రూపొందించాము. మొదటిదశలో ఉండవల్లి నుండి అటూఇటుగా ఉద్దండ్రాయునిపాలెం వరకూ విస్తరిస్తాం. రెండోదశలో మిగిలిన కరకట్టనూ పూర్తి చేస్తాము. ఇటీవల కృష్ణానదికి పదిలక్షల క్యూసెక్కులకు పైబడి వరదనీరు వచ్చింది. కరకట్టను 15 లక్షల పైబడి క్యూసెక్కులు వచ్చినా తట్టుకునే విధంగా నిర్మించనున్నాము. సదుపాయాల కల్పన విషయంలో టైంబాండ్ ఉంటుంది. రాజీపడటం అనేది ఉండదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణ సూచనలతో వీలైనంత త్వరగా పనులు పూర్తిచేస్తాం.

ప్ర : నిధుల సమీకరణ గురించి చెబుతారా?

జ : అవన్నీ ప్రభుత్వం మిగతా 7లో

బ్రెజిల్‌లో కూలిన విమానం

- 10 మంది మృతి
- 12 మందికి గాయాలు

బ్రసీలియా : బ్రెజిల్‌లో నివాస గృహాలపై ఓ చిన్న విమానం కూలిపోయిన ప్రమాదంలో 10 మంది మరణించగా, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రముఖ పర్యాటక పట్టణమైన గ్రామాడోలో ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. రియో గ్రాండే డూ సుల్ స్టేట్‌లోని కనేలా ఎయిర్‌పోర్ట్‌లో వ్యాపారవేత్త లూయిజ్ క్లాయుడియో గలియాజి కుటుంబంతో బయలుదేరిన ఈ విమానం తరువాత 10 నిమిషాల్లోనే కూలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదు. విమానంలో ఉన్న మొత్తం 10 మంది మరణించగా, నేలపై ఉన్న 12 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. 61 ఏళ్ల వ్యాపారవేత్త లూయిజ్ క్లాయుడియో, అతని భార్య, వారి ముగ్గురు కుమార్తెలు, కుటుంసభ్యులతో సావో పాలో పట్టణం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా, పర్వత ప్రాంతంలో ఉండే గ్రామాడో పట్టణం బ్రెజిల్‌లో ప్రముఖ పర్యాటక స్థలం. చల్లని వాతావరణం, హైకింగ్ ప్రదేశాలలతో క్రిస్మస్ సెలవులకు ప్రసిద్ధి పొందింది.

5, 8 తరగతులకు

డిటెన్షన్ విధానం

న్యూఢిల్లీ : కేంద్రీయ విద్యాలయాల్లోని 5, 8 తరగతుల విద్యార్థులకు 'డిటెన్షన్' విధానాన్ని తిరిగి పెడుతున్నారు. ఇకపై వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ ఆ తరగతుల్లోనే చదవాల్సి వుంటుంది. 2019లో విద్యా హక్కు చట్టాని(ఆర్‌టిఇ)కి సవరణ చేయడంతో 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటికే ఈ రెండు తరగతుల విద్యార్థులకు నో డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేశాయి. రెగ్యులర్ పరీక్షలు నిర్వహించిన తర్వాత ఒక విద్యార్థి పై తరగతికి ప్రమోట్ కాలేకపోయిన పక్షంలో ఫలితాలు వెలువడిన రెండు మాసాల వ్యవధిలో మళ్ళీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తారు. ఆ పరీక్షలో కూడా ప్రమోషన్ ప్రమాణాలు అందుకోలేని పక్షంలో ఆ విద్యార్థి మళ్లీ అదే తరగతిలో చదవాల్సి వుంటుందని గెజిట్ నోటిఫికేషన్ పేర్కొంది. అదే తరగతిలో ఆ విద్యార్థి మళ్లీ చదివే క్రమంలో తరగతి ఉపాధ్యాయులు ఆ విద్యార్థికి, తల్లిదండ్రులకు అవసరమైన మార్గనిర్దేశనం చేస్తారు. వివిధ దశల్లో విద్యార్థి నేర్చుకునే క్రమంలో లోపాలు, లొసుగులు వుంటే వాటిని సరిదిద్దుతారని ఆ నోటిఫికేషన్ పేర్కొంది. ప్రాథమిక విద్య పూర్తయ్యేవరకు ఏ విద్యార్థిని ఏ స్కూలు నుండి బహిష్కరించరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక స్కూళ్ళతో సహా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 3వేల స్కూళ్ళకు పైగా ఈ నోటిఫికేషన్ వర్తిస్తుందని విద్యా శాఖ సీనియర్ అధికారులు పేర్కొన్నారు. స్కూలు విద్య అనేది రాష్ట్రానికి సంబంధించిన అంశమైనందున, రాష్ట్రాలు ఇందుకు సంబంధించి తమ స్వంత నిర్ణయాలు తీసుకోవచ్చు. హర్యానా, పుదుచ్చేరిలు ఇంతవరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. కాగా మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రం ఈ విధానాన్ని కొనసాగిస్తున్నాయని సీనియర్ అధికారి తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై ఎంపిలు స్పందించాలి

- దళిత, గిరిజన ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో అవమానపరిచిన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్ష పార్టీల పార్లమెంట్ సభ్యులందరూ స్పందించాలని దళిత, గిరిజన ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఇదే విషయాన్నికోరుతూ ఎంపిల నివాసాలకు వెళ్లి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. విజయవాడ సున్నపు బట్టీల సెంటర్‌లోని పూలే, అంబేద్కర్ భవనంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన సోమవారంఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దళిత శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్‌ఎంఎం) జాతీయ నాయకుడు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతను

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలు అంబేద్కర్‌ను అవమానించడమే కాదని దేశంలోని ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, యావత్తు ప్రజలను అవమానించడమేనని చెప్పారు.

అమిత్‌షా తక్షణమే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు, పదవినుంచి వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. దేశానికి మతోన్మాద భావజాలం పెద్ద ప్రమాదకరమని, దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, వారిని కూడగట్టాలన్నారు. అంబేద్కర్ పై వ్యాఖ్యలతో తన మనువాద మతోన్మాధ ధోరణి అమిత్‌షా బయట పెట్టుకున్నారని చెప్పారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్రహోంశాఖమంత్రి అమిత్‌షా తక్షణమే తనపదవికి రాజీనామా చేయాలని, ప్రజలకు భేషరుతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంఅనుసరిస్తున్న పెత్తందారి పోకడలు రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదకరమన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జైభీమ్ జస్టిస్ చింతా వెంకటేశ్వర్లు, రిటర్డ్ ప్రిన్సిపాల్ ఎన్ లక్ష్మణరావు, యు, లక్ష్మీనారాయణ, బిఎస్‌పినాయకులు వి.బుజ్జి,పాస్టర్ బోస్కో,పిఆర్ మోహన్‌రావు, బేడ, బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షులు ఎలమర్తి మధు ,జి.దస్తగిరి , అడ్వకేట్ సర్వేపల్లి సుదర్శనరావు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, కె.శ్రీదేవి, వృత్తి సంఘాలరాష్ట్ర కన్వీనరు ఎం.భాస్కరయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి, రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర కన్వీనరు దయా రమాదేవి, కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి హరిబాబు, ప్రజాసంఘాల నాయకులు ఎం.సూర్యారావు, దానియేలు,మాల మహానాడు నాయకులు బాల కోటేశ్వరరావు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నటరాజ్,జి క్రాంతికుమార్, ఆంతోని, అబ్రహం పాల్గొన్నారు.

అల్లు అర్జున్ ఇంటిపై దాడి సరైంది కాదు

- తొక్కిసలాట బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

సినీ నటుడు అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. దాడికి కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమైందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతంకాకుండా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించి వారిని ఆదుకోవాలని, ఆ కుటుంబానికి అండగా నిలవాలని ఆయన సూచించారు. ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలను ఆసరాగా తీసుకుని వ్యక్తిగత ద్వేషాలు రెచ్చగొట్టే విధంగా, యువత పెడదోవ పట్టే విధంగా ఎవరూ వ్యవహరించకూడదన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. సినీ నటులు బయటకు వచ్చినప్పుడు బౌన్సర్ల హడావుడి ఎక్కువగా ఉంటుందని, ప్రైవేటు సైన్యంలాగా బౌన్సర్లు వ్యవహరిస్తుండటం కరెక్ట్ కాదన్నారు. సినీనటులు వ్యాపార సంస్థలు ప్రారంభానికి వచ్చిన సమయాల్లో ప్రభుత్వం పోలీసులు ద్వారా రక్షణ కల్పించాలని వి.శ్రీనివాసరావు సూచించారు.

పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, పాపినేని శివశంకర్ తదితరులు

నిత్య సాహిత్య శ్రామికుడు 'పెనుగొండ'

- లక్ష్మీనారాయణ సన్మాన సభలో వక్తలు

ప్రజాశక్తి- గుంటూరు

సుదీర్ఘకాలం నుండి సాహిత్య రచనలు చేస్తూ, మరుగున పడిన సాహిత్యాన్ని వెలుగులోకి తేవడంలో విశేష కృషి చేసిన అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ... కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక కావడం అభ్యుదయ సాహిత్యానికి మరింత విలువను పెంచుతుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో పెనుగొండ అభినందన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలని, చరిత్రలోని ఘర్షణను ప్రతిబింబించాలని, అటువంటి గొప్ప కృషిని పెనుగొండ ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పానినేని శివశంకర్ మాట్లాడుతూ తాను రచనలు చేయడంతోపాటు, ఎంతోమందిని ఈ రంగంలో ప్రోత్సహిస్తూ నిత్య సాహిత్య శ్రామికుడిగా లక్ష్మీనారాయణ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ప్రస్తుత తరుణంలో సాహితీ రంగం కలుషితం అవుతోందని, నిజాయితీ, నిష్కళంకం కొరవడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాతావరణంలోనూ పట్టుదలతో 45 సంవత్సరాలుగా సాహితీ కృషి చేయడం అభినందనీయమన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు సత్యాజీ మాట్లాడుతూ అరసం జాతీయ అధ్యక్షుడైనా పెనుగొండ ఎంతో నిడారంబరత కలిగిన సాహితీ కార్యకర్త అని, అనేకమంది కొత్త రచయితలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. చరిత్రలో మరుగునపడిన గొప్పగొప్ప రచనలను వెలికితీశారన్నారు. అభ్యుదయ సాహిత్యానికి ఈ పురస్కారం మరింత విలువ పెంచుతుందని పేర్కొన్నారు. జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాకు చెందిన అభ్యుదయ రచయిత పెనుగొండకు అవార్డు దక్కడం అభినందనీయం, అభ్యుదయ శక్తులకు ఇది మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని అన్నారు. అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రచయితలు ఎన్నో కష్టనష్టాలకోర్చి పుస్తకాలు రాస్తున్నారని, ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవాలని, ప్రతి ఒక్కరిలో అధ్యయన స్ఫూర్తి పెంపొందించడానికి కృషి చేయాలని కోరారు. తెలుగు నాట సాంస్కృతిక పునరుజ్జీవనానికి అరసం, విరసం, సాహితీ స్రవంతి వంటి సంస్థలు చేసిన కృషి ఫలితంగా బలమైన అభ్యుదయ సాహిత్య పునాదులు పడ్డాయన్నారు. వాటిని నేటి తరం మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, జాషువా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎన్.కాళిదాసు ప్రసంగించారు. అనంతరం పెనుగొండను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

త్వరలోనే క్రిస్టియన్ మిషనరీస్ ప్రోపర్టీస్ డెవలప్‌మెంట్ బోర్డు

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్రీస్తు బోధనల స్ఫూర్తితో స్వాతంత్ర్యం రాకముందు నుంచే క్రిస్టియన్ మిషనరీస్ ప్రజలకు అనేక రకాలుగా స్వచ్ఛంధ సేవలు అందిస్తున్నాయని, ఈ సంస్థల పరిరక్షణ కోసం త్వరలోనే క్రిస్టియన్ మిషనరీస్ ప్రోపర్టీస్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. చర్చిల నిర్మాణానికి, పునరుద్ధరణకు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో సిఎం పాల్గొని మాట్లాడారు. ఆర్థిక అసమానతలను తొలగించేందుకు కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.

మైనార్టీ వర్గాల సంక్షేమానికి, భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సేవా కార్యక్రమాలు చేసే ఒక్కో సంస్థకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేశామన్నారు. గుంటూరులో క్రిస్టియన్ భవనానికి 2 ఎకరాల స్థలం కేటాయించడంతోపాటు రూ.10 కోట్లు నిధులిచ్చామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో నిర్లక్ష్యం చేసిందని, త్వరలోనే ఆ భవనాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. విజయవాడలో సిఎస్ఐ సెయింట్ బాసిలికా చర్చికి రూ.1.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. క్రైస్తవ శ్మశానవాటికల కోసం నిధులు మంజూరు చేశామన్నారు. జెరూసలెం వెళ్లే వారికి ఆర్థికసాయం అందిస్తామన్నారు. ప్రేమ, కరుణ, సేవలకు ప్రతీక క్రిస్టియానిటీ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను సిఎం చంద్రబాబు కట్ చేశారు. కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. మంత్రులు ఎన్ఎండి ఫరూక్, సవిత, కొల్లు రవీంద్ర, డిప్యూటీ స్పీకర్ కె రఘురామరాజు, స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపి కేశినేని శివనాథ్ తదితరులు ప్రసంగించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

- రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు
- ముసాయిదా ప్రతులు దహనం

ప్రజాశక్తి - యంత్రాంగం

జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత, బాష్పవాయువు ప్రయోగాలు ఆపాలని, గౌతం బుద్ధ నగర్‌లోని లక్సర్ జైలులో ఉన్న రైతులందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా కిసాన్ సంయుక్త మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిచంఆరు. మార్కెట్ల ప్రయివేటీకరణ ముసాయిదా ప్రతులను దహనం చేశారు. మద్దతు ధర గ్యారెంటీ చట్టం, రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని నాయకులు నినదించారు. ఇతర ప్రజాసంఘాల నాయకుల పాల్గొని మద్దతు తెలిపారు.

తిరుపతి కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత, రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు మాంగాటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు నల్లచట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన మోడీ, వాటిని అమలు చేయకుండా దొడ్డిదారిన జాతీయ మార్కెట్ విధానాన్ని తీసుకొచ్చి రైతులను మోసం చేశారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు దోచి పెడుతున్న కేంద్రం ప్రభుత్వం చివరకు వ్యవసాయాన్ని ప్రయివేట్‌పరం చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. శ్రీకాళహస్తిలో నిరసన తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టారు. శ్రీకాకుళంలో అంబేద్కర్ కూడలి వద్ద ఆందోళన నిర్వహించారు.

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ముసాయిదా ప్రతులను దహనం చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

పార్వతీపురంలో జరిగిన ధర్నాలో రైతు సంఘం మన్యం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, విజయనగరంలో అధ్యక్షులు బి.రాంబాబు మాట్లాడారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట, ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నంద్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఏలూరులో పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వ్యవసాయ మార్కెట్ చట్టం ముసాయిదా ప్రతులను దహనం చేశారు. కుక్కునూరులో నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శ్యామల సెంటర్‌లో ముసాయిదా ప్రతులను దహనం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి నల్ల చట్టాల ప్రతులను దహనం చేసి నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో వ్యవసాయ మార్కెట్ వద్ద ముసాయిదా ప్రతులను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నగిరి కాటమయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న తదితరులను అరెస్టు చేసి టుటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

వచ్చే ఏడాది నుండి

మున్సిపల్ నిధులు సొంత అవసరాలకే

- కమిషనర్ల వర్కుషాప్‌లో మంత్రి నారాయణ
- భవన నిర్మాణ ప్లాన్ల సరళతరం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి మున్సిపాలిటీల నిధులను సొంత ఖర్చులకే వినియోగిస్తామని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం చేసిందని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం నాడు నాగార్జున యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాల్లో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యాన మున్సిపల్ కమిషనర్ల వర్కుషాప్ జరిగింది. దీనికి మంత్రి నారాయణ, పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి కన్నబాబు, మెప్మా ఎమ్‌డి తేజ్‌భరత్, ప్రజారోగ్య విభాగ ఇఎన్‌సి మరియన్న హాజరయ్యారు. మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయి వసతుల కల్పనపై చర్చించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. తాగునీరు, డ్రెయినేజీ లైన్లు, వరదనీటి కాలువల నిర్మాణం, వీధి దీపాలు, రోడ్లు కల్పించాలని సిఎం సూచించారని పేర్కొన్నారు. దీనిపై వచ్చే నెలాఖరులోపు డిపిఆర్‌లు సిద్ధం చేయాలని తెలిపారు. అనుమతి పొందిన పనులు ప్రారంభించిన మూడేళ్లలోపు వాటిని పూర్తి చేయాలని సూచించారు. వాటికి అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూరుస్తుందని, కేంద్ర నుండి పలు పథకాల ద్వారా వచ్చే నిధుల కోసం సంప్రదింపులు జరిపి త్వరితగతిన తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పారు. గతంలో రాష్ట్రం మ్యాచింగు గ్రాంటు ఇవ్వకపోవడంతో ఎడిబి, అమృత్ పథకం నిధులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం ఆయా సంస్థలతో చర్చించి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని, పనులూ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. దేశంలో ఉత్తమ మున్సిపాలిటీల రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దాలని అన్నారు. అలాగే పట్టణ ప్రణాళిక విభాగంలో సంస్కరణలు తీసుకొచ్చామని చెప్పారు. దీనికోసం ఏకీకృత వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, దాని ఆధారంగా ఆన్‌లైన్లోనే దరఖాస్తులు చేసుకోవచ్చుని చెప్పారు. దాని ఆధారంగా నిర్ణీత ఫీజు చెల్లిస్తే నిబంధనల మేరకు అనుమతులు వస్తాయని వివరించారు. గతంలో మాదిరి ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అన్ని విభాగాలతో కలిపి ఈ విధానం అమలవుతుందని చెప్పారు. అలాగే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు నిర్మించడం ద్వారా చెత్త లేకుండా చర్యలు చేపడుతున్నామని, 2014-2019 మధ్య టిడిపి హయాంలో పన్నులు పెంచలేదని వివరించారు. ప్రజలకు అవసరమైన వసతులు కల్పిస్తూ ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా పన్నులు వసూలు చేయాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలకు రండి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు పిడిఎఫ్, యుటిఎఫ్ ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సభలను ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పిడిఎఫ్, యుటిఎఫ్ ఆహ్వానించాయి. కాకినాడలో జనవరి 5 నుంచి 8 వరకు జరిగే ఈ కార్యక్రమానికి హాజరుకావాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, బొర్రా గోపిమూర్తితో కలిసి ఫెడరేషన్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు, ప్రచురణ కమిటీ ఛైర్మన్ ఎం హనుమంతరావు సచివాలయంలో ముఖ్యమంత్రిని సోమవారం కలిసి కోరారు. 5వ తేదీ నుంచి జరిగే మహాసభలను ప్రారంభించాలని కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఇటీవల ఉభయ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి సభ్యులుగా ఉప ఎన్నికల్లో విజయం సాధించిన గోపిమూర్తిని ముఖ్యమంత్రి అభినందించారు.

ఇంటర్ తత్కాల్ ఫీజు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల తత్కాల్ ఫీజును ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. మార్చిలో జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 24 నుంచి 31 వరకు తత్కాల్ కింద రూ.3 వేలు అపరాధ రుసుం చెల్లించి నమోదు చేసుకోవచ్చునని వెల్లడించింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రైతుల సమస్యలకు పరిష్కారం ఏదీ?

- పిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికి పరిష్కరిస్తారని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే రైతుల పక్షాన నిలిచి పోరాటం చేస్తామని జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతులకు హామీ ఇస్తున్నట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు ఇవ్వాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ప్రభుత్వ చర్యల వల్ల రాష్ట్రంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందన్నారు. గిట్టుబాటు ధర అందకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం మాత్రం రైతుల సమస్యలు పట్టించుకోకుండా కార్పొరేట్‌లకు కొమ్ముకాస్తుందన్నారు.

పోలీసుల నోటీసులను రద్దు చేయండి

- పేర్ని నాని పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

రేషన్ బియ్యం కేసులో తమను సాక్షులుగా విచారణకు హాజరుకావాలని మచిలీపట్నం తాలూకా పోలీసుల నోటీసులపై వైసిపి నేత, మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన కుమారుడు పేర్ని సాయి కృష్ణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల నోటీసులపై తదుపరి చర్యలను నిలిపివేయాలని, తమకు సంబంధం లేని కేసులో సాక్షులుగా ఎలా పిలుస్తారని పిటిషన్‌లో ప్రశ్నించారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం విచారించనుంది.

అన్ని కేసుల్నీ ఒకటిగా పరిగణించండి

- సోషల్ మీడియా కేసులపై సజ్జల భార్గవ్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా పోస్టులపై రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు కేసులను నమోదు చేయడాన్ని వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. సత్యసాయి జిల్లా, రొద్దం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌నే అన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్‌గా పరిగణించాలని కోరారు. సోషల్ మీడియా పోస్టులకు చెందిన కేసులు నమోదు చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఒకే విషయంపై బహుళ ఎఫ్ఎఆర్‌లు నమోదు చట్ట వ్యతిరేకమన్నారు. ఆధారాలు లేకుండా తనపై పలు కేసులు నమోదు చేసి జీవించే హక్కులను కాలరాస్తున్నారని చెప్పారు.

విక్రాంత్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దు : కెవి రావు

కాకినాడ సీ పోర్టు వాటాల బదిలీల వ్యవహారంపై సిఐడి పెట్టిన కేసు నిందితుడు వై విక్రాంత్‌రెడ్డికి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని ఫిర్యాదుదారు కర్నాటి వెంకటేశ్వరరావు (కెవి రావు) కోరారు. ముందస్తు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందన్నారు. ఈ కేసులో తనను ప్రతివాదిగా చేర్చాలని, తన వాదనలు వినాలని కోరారు. వాటాల బదిలీ విషయంలో చెప్పినట్లు చేయాల్సిందేనని విక్రాంత్‌రెడ్డి తనను, తన కుటుంబ సభ్యులను బెదిరించారని ఆయన ఇంప్లీడ్ పిటిషన్ వేశారు.

ధాన్యంపై దళారుల పంజా

- కొనుగోలు కేంద్రాల్లేక అన్నదాతల అవస్థలు
- గతేడాది కంటే ధర దిగ్గోతతో నష్టాలు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలోని ధాన్యం రైతులను ప్రభుత్వం దళారుల దోపిడీకి వదిలేసింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారుల ఇష్టారాజ్యంగా మారింది. మద్దతు ధర అమలు కావడం లేదు. దళారులు ఎంతిస్తే అంత తీసుకోవాల్సి వస్తోంది. ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు గోదాములు లేవు. దీనికి తోడు తుపాను భయం వెంటాడుతోంది. పంట పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. దీంతో, కళ్లాల్లోనే తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురవడంతో రైతులు సాగును త్వరగా ప్రారంభించారు. ఖరీఫ్‌లో నంద్యాల జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో, కర్నూలు జిల్లాలో 71,627 ఎకరాల్లో వరి సాగు చేశారు. 20 రోజుల క్రితం నుండి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెట్టుకుంటున్నారు. ఎకరాకు రూ.40 వేల చొప్పున పెట్టుబడి అయింది. ధాన్యం సేకరణ ప్రాంతం కాదనే సాకుతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దీంతో, రైతులు విధిలేక దళారులను ఆశ్రయిస్తూ తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 60 శాతం వరి పంట కోతలు పూర్తయ్యాయి. ఎకరాకు కర్నూలు సోనా రకం 35 నుండి 40 బస్తాలు, నంద్యాల సోనా రకం 30 నుండి 35 బస్తాల దిగుబడి వస్తోంది. గతేడాది ఈ రకాల ధాన్యానికి క్వింటాలుకు సుమారు 2,650 ధర లభించింది. ఈ

కళ్లాల్లో వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న వ్యాపారులు

ఏడాది కేంద్ర ప్రభుత్వం ఈ రకాలకు క్వింటాలు ఒక్కంటికీ రూ.2,330 మద్దతు ధర ప్రకటించింది. కర్నూలు సోనా రకాన్ని రూ.1,734 నుంచి రూ.1,800కు, నంద్యాల సోనా రకాన్ని రూ.1,866 నుండి రూ.1933కు మాత్రమే దళారులు, మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారు. పైగా తాలు, తేమ పేరిట ఐదు కేజీల ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారు. దీంతో, రైతులు రెండు విధాలా నష్టపోతున్నారు.

రోడ్డెక్కిన అన్నదాతలు

నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల ఐదున రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జెసి విష్ణు చరణ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇవే డిమాండ్లతో ఈ నెల 11న రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ నెల 18న కిసాన్ మేళాలో మంత్రులకు ఎపి రైతు సంఘం నాయకులు విన్నవించారు.

తరుగు పేరిట క్వింటాలుకు అదనంగా 5 కిలోలు

నేను ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాను. 150 బస్తాల దిగుబడి వచ్చింది. ధాన్యం నాసిరకంగా ఉన్నాయంటూ, నలిపితే బియ్యం గింజలు విరిగిపోతున్నాయంటూ బస్తాపై అదనంగా మూడు కిలోలు, తేమ శాతం అధికంగా ఉందంటూ మరో రెండు కిలోల చొప్పున క్వింటాలు ఒక్కంటికీ ఐదు కిలోలు తరుగు తీసుకున్నారు

- నాగ సుబ్బయ్య, యనకండ్ల, బనగానపల్లె మండలం

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నంద్యాల ప్రాంతంలో నాణ్యమైన వరి పండుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి రావడంతో రైతులు నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

- టి.రమేష్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

డోర్ డెలివరీ డెడ్‌బాడీ గుర్తింపు

ప్రజాశక్తి - కాళ్ల, ఉండి

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో పశ్చిమగోదావరి పోలీసులు పురోగతి సాధించారు. ఇప్పటి వరకూ మిస్టరీగా ఉన్న మృతుని వివరాలను ఎట్టకేలకు ఛేదించారు. పార్శిల్‌లో వచ్చిన మృతదేహం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం గాంధీనగరానికి చెందిన బర్రె పర్లయ్య (40)దిగా గుర్తించారు. మృతుని మేనల్లుడు దుర్గారావు నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ పర్లయ్య జీవనం సాగిస్తున్నాడు. ఆయన మద్యానికి బానిస కావడంతో భార్య విడిగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పర్లయ్య ఒక్కడే గాంధీనగరంలో నివాసం ఉంటున్నాడు. డెడ్‌బాడీ డోర్ డెలివరీ అయిన గాదిరాజు రంగరాజు చిన్న అల్లుడు తిరుమాని శ్రీధర్‌వర్మ నివాసం కూడా గాంధీనగరం కావడం, వర్మ పరారీలో ఉండడంతో ప్రధాన నిందితుడు వర్మేనని పోలీసులు భావిస్తున్నారు. ఆయన కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పర్లయ్యది హత్యేనని గుర్తించారు. ఆక్వా చెరువులో పని నిమిత్తం పర్లయ్యను తీసుకెళ్లి హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

నాసిరకం బొగ్గు సరఫరాపై చర్యలేవి? : సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి హయాంలో కృష్ణపట్నం ప్లాంట్‌కు నాసిరకం బొగ్గును సరఫరా చేసిన అరబిందో కంపెనీపై కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతోందని, అయినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణపట్నం విద్యుత్ ప్లాంట్‌కు మట్టితో కూడుకున్న 4.5 లక్షల టన్నుల బొగ్గును టన్నుకు రూ.8,500 చొప్పున అరబిందో కంపెనీ సరఫరా చేసిందన్నారు. దీనివల్ల ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్స్ (పిఎల్‌ఎఫ్) కూడా పడిపోయిందన్నారు. ఈ అంశంపై జెన్‌కో ఉద్యోగులు కూడా ధర్నా చేశారని చెప్పారు. నాసిరకం బొగ్గు కొనుగోలు చేయడం, మార్కెట్ ధర కంటే అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వల్ల జెన్‌కోకు సుమారు రూ.700 కోట్ల నుంచి వెయ్యి కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్నారు. అరబిందో సంస్థ పెద్ద మొత్తంలో కుంభకోణాలకు పాల్పడినట్లు ఆధారాలుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంపై సిఐడి, విజిలెన్స్ విచారణ జరిపి ఆ కంపెనీ దోపిడీ దందాలను బయటపెట్టి నష్టాన్ని రాబట్టాలని డిమాండ్ చేశారు. 104, 108 అంబులెన్స్ సర్వీస్‌లో కూడా అరబిందో కుంభకోణాన్ని అసెంబ్లీ సాక్షిగా తాను బయటపెట్టానని, దీనిపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఇంట్లోనే కులం, మతం... బయట భారతీయులం..!

- విధానపరంగా మోడీ, బాబు, జగన్ ఒక్కటే
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు
- సిపిఎం 'అనంత' 14వ జిల్లా మహాసభ ప్రారంభం

అనంతపురంలో నిర్వహించిన ర్యాలీ ముందు భాగంలో సిపిఎం జిల్లా అగ్రనాయకత్వం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఇంట్లో కులం-బయట హిందువులం' అంటూ బిజెపి దేశ ప్రజల మధ్య చీలిక తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. కమ్యూనిస్టుల నినాదం ఇంట్లోనే కులం, మతం.. బయట భారతీయులం అనే నినాదం కావాలి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు తెలిపారు. దేశ ప్రజల మధ్య ఐక్యతను తాము కోరుకుంటే... మతం పేరుతో బిజెపి విభజన కోరుకుంటోందని వివరించారు. బిజెపి విభజన వాదాన్ని సమైక్యతతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరిగే సిపిఎం అనంతపురం 14వ జిల్లా మహాసభ సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్‌లోని లలిత కళాపరిషత్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహిళల కోలాటాలు, డప్పు కళాకారుల డప్పుల దరువు ఆకట్టుకుంది. ప్రముఖ కమ్యూనిస్టు నేతల చిత్రపటాలతో 40 మీటర్ల పొడవైన ఎర్ర పతాకాన్ని రెడ్‌షర్టు వలంటీర్లు పట్టుకుని నడవడం అందరినీ ఆకర్శించింది. అనంతరం లలిత కళా పరిషత్‌లో బహిరంగ సభ జరిగింది. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల మధ్య విభజన తీసుకురావడం... ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడమే బిజెపి పనిగా పెట్టుకుందన్నారు. ఈ పదేళ్ల కాలంలో ఒక్క ప్రభుత్వరంగ పరిశ్రమ ఏర్పాటు చేయలేదని, ఉన్న పరిశ్రమలను మాత్రం ప్రయివేటుపరం చేసిందని తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని ప్రయివేటుకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడితే వెనక్కు తగ్గినట్టు కనిపించినా... ఇతర రూపాల్లో దీన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం మరోమారు చేస్తూనే ఉందని తెలిపారు. విద్యుత్ ఒప్పందాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలొస్తున్నా... అధికారంలోనున్న టిడిపి ఎందుకు నోరు మెదపడం లేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. స్మార్టు మీటర్లకు వ్యతిరేకమని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన నారా లోకేశ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే విషయంలో మోడీ, చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కటేనన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబుళు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాకు సాగు, తాగునీటిని అందించే హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువల ఆధునీకరణను ఈ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. ఈ మూడు సంవత్సరాల కాలంలో చేపట్టిన కార్యక్రమాలను పున:సమీక్షించుకుని, రాబోయే మూడు సంవత్సరాల కార్యాచరణను మహాసభలో నిర్ణయించుకుంటామని తెలిపారు.

ప్రతినిధుల సభ ప్రారంభం

అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి అనంతపురం నగరంలోని గుత్తిరోడ్డులో గల ఎస్ఎన్ గ్రాండ్ ఫంక్షన్ హాలులో మహాసభ ప్రారంభమైంది. తొలుత ఎర్ర జెండాను సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు నాగరాజు ఎగురవేశారు. ఆ తరాత్వత అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు ఇటీవ చనిపోయిన మృతులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం మహాసభనుద్దేశించి వై.వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. కార్యదర్శి నివేదికను సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రవేశపెట్టారు.

మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గంజాయి కేసులైతే నా వద్దకు రాకండి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - కశింకోట (అనకాపల్లి)

రాష్ట్రంలో యువత గంజాయికి బానిసలవుతున్నారని, ఆ కేసుల విషయమై తన వద్దకు ఎవ్వరూ రావొద్దని అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్నపాత్రుడు అన్నారు. కశింకోటలో ఓ ప్రయివేటు కల్యాణ మండపం వేదికగా పలు అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి ఒక్కరూ మత్తుకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎంపి సిఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్‌లో ప్రొటోకాల్ రగడ!

ప్రజాశక్తి- కడప అర్బన్

మేయర్‌తో వాగ్వాదం చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో వైసిపి, టిడిపి నేతల మధ్య నెలకొన్న ప్రొటోకాల్ రగడ కొనసాగుతూనే ఉంది. సోమ వారం నిర్వహించిన నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో కుర్చీ కోసం మరోమారు ఎమ్మెల్యే మాధవి పట్టుబట్టారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అభివృద్ధి పనులకు నిధులు, కాంట్రాక్టు, అదనపు పారిశుధ్య కార్మికుల వేతనాల నిధులు ఆమోదం కోసం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ ఛాంబర్ పక్కన సీటు వేయాలని ఎమ్మెల్యే మాధవి, టిడిపి కార్పొరేటర్లు పట్టుబట్టడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యేకు మద్దతుగా, మేయర్ మద్దతుగా కార్పొరేటర్లు పోటీపడి నినాదాలు చేశారు. గంటన్నర పాటు నినాదాలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. మేయర్ కుర్చీకి ఒకవైపు వైసిపి, మరోవైపు టిడిపి కార్పొరేటర్లు నిల్చుని నిరసన తెలిపారు. టిడిపి, వైసిపి కార్పొరేటర్ల మధ్య తోపులాట చోటు చేసుకుంది. అజెండాను కొనసాగించేందుకు సహకరించాలని మేయర్ సురేష్‌బాబు పదేపదే విజ్ఞప్తి చేసినా ఎమ్మెల్యే, సభ్యులు వినకపోవడంతో ఎమ్మెల్యేను, ఏడుగురు టిడిపి కార్పొరేటర్లను సస్పెండ్ చేస్తూ మేయర్ ఆదేశాలు జారీ చేశారు. అయినా వారు బయటకు వెళ్లలేదు. అజెండాను చదివేందుకు ప్రయత్నించిన వెంటనే ఆ కాపీలను టిడిపి కార్పొరేటర్లు చించివేశారు. పరిస్థితి చేయిదాటి పోతుందని గ్రహించిన మేయర్ సభను అరగంట పాటు వాయిదా వేశారు. సభ కొనసాగకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోతాయని మేయర్ ఆందోళన వ్యక్తం చేశారు. గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో సభను నిరవధిక వాయిదా వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు మేయర్ కుడి, ఎడమ వైపు వేదికపై కుర్చీలు వేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం మారి టిడిపి అధికారంలోకి రాగానే మొదటి సమావేశానికి మేయర్ సురేష్ బాబు హాజరు కాలేదన్నారు. అప్పుడు కుర్చీ యథావిధిగా ఉంచి తనను గౌరవించారని గుర్తు చేశారు. మేయర్ సురేష్ బాబు సమావేశానికి హాజరైన ప్రస్తుత మేయర్ పక్కన సీటు లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహిళలను మేయర్ అవమానిస్తున్నారని పేర్కొన్నారు.

30న పిఎస్ఎల్‌వి సి-60 ప్రయోగం

- ఒక్క రాకెట్ ద్వారా 24 పరిశోధనలు!



ప్రజాశక్తి-సూళ్లూరుపేట

శ్రీ హరికోట నుంచి ఈ నెల 30న ప్రయోగించనున్న పిఎస్ఎల్‌వి సి-60 రాకెట్ ద్వారా ఏకంగా 24 పరిశోధనలకు ఇస్రో సిద్ధమవుతోంది. ఒక్క రాకెట్ ద్వారా వంద ఉపగ్రహాలను గతంలో పంపించిన ఇస్రో, ప్రస్తుతం రాకెట్‌లోని నాలుగవ దశలో విభిన్న పరిశోధనలకు శ్రీకారం చుట్టనుంది. ఏకంగా 24 పరిశోధనలు ఇపిఎస్-4 ద్వారా రాబట్టడానికి కొన్ని ఉపకరణాలను ప్రవేశపెట్టనున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పిఎస్ఎల్‌వి సి-60 రాకెట్ ద్వారా స్పేడెక్స్ ఉపగ్రహాలు కక్షలోకి పంపనున్నారు. వీటి ద్వారా ఇస్రోకు విలువైన సమాచారంతో పాటు భవిష్యత్తులో జరిగే స్పేస్ స్టేషన్ నిర్మాణంలో కొన్ని పరిశోధనలను ఆశిస్తున్నారు. 14 ఉపకరణాలు ఇస్రోవి కాగా, మరో పది ఉపకరణాలు దేశంలోని వివిధ ప్రవేట్ స్టార్టప్ కంపెనీలు, విశ్వవిద్యాలయాలకు చెందిన వారివి. ఈనెల 30న రాత్రి 9.48 గంటలకు పిఎస్ఎల్‌వి సి- 60 రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో తెలిసింది. షార్‌లోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈ ప్రయోగం చేపట్టనున్నారు. ఇప్పటికే పిఎస్-ఎల్‌వి అనుసంధాన భవనంలో నిర్మాణం పూర్తి చేసి ప్రయోగ వేదిక వద్దకు రాకెట్‌ను చేర్చారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలోనే ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నారు.

జనవరి2 నుంచి విజయవాడ పుస్తక మహోత్సవం

- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహణ

ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న పుస్తక మహోత్సవం నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే 35వ పుస్తక మహోత్సవం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జనవరి రెండు నుంచి నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.లక్ష్మయ్య, టి.మనోహర్ నాయుడు తెలిపారు. సోమవారం గవర్నరుపేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ.. జవవరి రెండు నుంచి 12 వరకు ఈ పుస్తక మహోత్సవం జరుగుతుందన్నారు. తొలుత నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించాలని అనుకున్నామని, ఆ తర్వాత ఎం.జి.రోడ్డులో నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించుకునేలా అనుమతులు ఇప్పించారని తెలిపారు. సొసైటీ తరపున పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 200 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పబ్లిషర్స్ తరలి రానున్నారన్నారు. పుస్తక మహోత్సవ్ ప్రాంగణానికి పిడికిటి రామకోటేశ్వరరావు (సాహితీ నవజీవన్ బుక్‌లింక్స్), ప్రధాన సాహిత్య వేదికకు ప్రముఖ పత్రిక సంపాదకులు చెరుకూరి రామోజీరావు (ఈనాడు గ్రూప్స్ చైర్మన్), ప్రతిభా వేదికకు ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా పేరు పెట్టినట్లు తెలిపారు. రెండవ తేదీ సాయంత్రం ఐదు గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ప్రారంభోత్సవం అనంతరం సాయంత్రం ఏడు గంటలకు చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. జనవరి ఆరవ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర ఉంటుందని, ఈ కార్యక్రమం మొగల్‌రాజపురం సిద్దార్థ ఆడిటోరియం నుంచి పుస్తక మహోత్సవ్ ప్రాంగణం వరకు జరుగుతుందని తెలిపారు. ప్రతిభా వేదికపై ప్రతిరోజూ పాఠశాల, కళాశాల విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. జనవరి 12న ముగింపు సభ ఉంటుందని తెలిపారు. పుస్తక మహోత్సవ్‌లో ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు 'నాకు నచ్చిన పుస్తకం నన్ను ప్రభావితం చేసిన పుస్తకం, నన్ను మార్చిన పుస్తకం' అనే అంశంపై ఎవరైనా మాట్లాడవచ్చని తెలిపారు. అయితే ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షులు బి.బాబ్జి, ఉపాధ్యక్షులు జె.ప్రసాద్, జాయింట్ సెక్రటరీ కె.రవి, ట్రెజరర్ జి.లక్ష్మి, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

పిఎంఎవై ఫేజ్-1లో 50 వేల ఇళ్లు

- రాష్ట్ర వ్యాప్తంగా అర్హుల సర్వే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) పథకం కింద 2025-26 సంవత్సరంలో ఫేజ్-1 కింద 50 వేల గృహాలు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అర్హులను ఎంపిక చేసేందుకు స్థానిక సంస్థలు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతో సర్వే చేపట్టింది. సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికార యంత్రాంగం ఉన్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు (ఎన్‌టిఆర్ కాలనీలు) ఇంటి నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం యూనిట్‌కు ఇచ్చే రూ.1.50 లక్షలతోపాటు పావలా వడ్డీకి బ్యాంకుల వద్ద రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.35 వేలు రుణం కింద ఇప్పించేది. ఆయా కాలనీలకు సంబంధించి మౌలిక వసతులు, మంచినీరు, డ్రెయినేజీ, విద్యుత్తు, రవాణా సౌకర్యం వంటివి రాష్ట్ర ప్రభుత్వం కల్పించాల్సి ఉండగా నేటికీ అత్యధిక కాలనీల్లో మౌలిక వసతులు రూపుదాల్చలేదు. పిఎంఎవై 2.0లో యూనిట్ కాస్ట్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కేటాయించనుంది. గడువు తేదీ సమీపిస్తుండటంతో దరఖాస్తులు చేసుకోవాలంటూ లబ్ధిదారులకు అవగాహన కల్పించే పనిలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపిడిఒలు, క్షేత్రస్థాయి ఉద్యోగులు ఉన్నారు. సాధారణ లబ్ధిదారులతో పాటు ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలకు రూ.50 వేల నుంచి రూ.75 వేలు అదనంగా ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిసింది. పిఎంఎవై 2.0 దరకాస్తుల గడువు ముగిసిన అనంతరం లబ్దిదారుల్లో అర్హులను ఎంపిక చేస్తారు. 2025 మార్చి అనంతరం రాబోయే ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశాలున్నారు. పాత లబ్ధిదారులు కూడా తమ గృహాలకు యూనిట్ విలువను పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడో రోజూ భూప్రకంపనలు

ప్రజాశక్తి-ముండ్లమూరు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా మూడో రోజూ భూప్రకంపనలు వచ్చాయి. గత పదేళ్ల కాలంలో భూప్రకంపనలు రావడం ఇది తొమ్మిదోసారి కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో 2002, 2004, 2022, 2023లో భూప్రకంపనలు వచ్చాయి. ఇప్పుడు మూడో రోజుల పాటు వరుసగా వచ్చాయి. మండలానికి వాయువ్య మూల నుంచి ఆగ్నేయ మూల వైపు ప్రకంపనలు వస్తున్నట్లుగా ప్రజలు గుర్తించారు. తొలుత శనివారం ఉదయం 10.30 గంటలకు భూమి మూడు సెకండ్ల పాటు పెద్ద శబ్దంతో కంపించింది. దీంతో ఇళ్లలోని సామగ్రి కిందపడిపోయాయి. ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గ్రామంలో పాఠశాల, పోలేరమ్మ గుడి ప్రహరీలకు బీటలు వచ్చాయి. ఆదివారం ఉదయం 10.30 గంటలకు పలు గ్రామాల్లో స్వల్పంగా భూమి కంపించింది. సోమవారం ఉదయం 10.24 గంటలకు, రాత్రి 8:12 గంటలకు, 8:15 గంటలకు స్వల్పంగా భూకంపన చోటు చేసుకున్నాయి. ఒకే రోజు మూడు సార్లు భూప్రకంపనలు రావడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని ఈదర, భీమవరం, ఉమామహేశ్వరపురం. వేముల, వేముల బండ, ఉల్లగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు, సింగనపాలెం, చంద్రగిరి, వేంపాడు. పోలవరం, శంకరాపురం గ్రామాల్లో భూమి కంపించింది. అధికారులు స్పందించి పరిశోధనలు జరిపించి భూప్రకంపనలు రావడానికి కారణాలను కనిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రకంపనలపై ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ ఆర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఈ ఘటనపై జాతీయ విపత్తుల అధికారుల బృందం వచ్చి పరిశీలిస్తుందని ఆమె చెప్పారని తహశీల్దార్ పేర్కొన్నారు.

పర్యాటకాభివృద్ధికి కృషి

- ఎపి టిడిసి చైర్మన్ బాలాజీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఎపి టిడిసి) చైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. విజయవాడలోని పర్యాటకశాఖ కార్యాలయంలో సంస్థ సభ్యులతో కలిసి సోమవారం సమీక్ష నిర్వహించారు. పర్యాటక పాలసీ-2024-29 ద్వారా పర్యాటక రంగం రాష్ట్రంలో కొత్త పుంతలు తొక్కుతుందని తెలిపారు. జిడిపి పెంపు, ఉపాధి కల్పన, పర్యాటకులకు అందుబాటులోకి గదులను తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

BSNL Jio airtel VI

జియోకు టారీఫ్‌ల భారీ దెబ్బ

- 1.65 కోట్ల ఖాతాదారుల గుడ్‌బై
- బిఎస్ఎన్ఎల్‌కు విశేష స్పందన
- ఇతర టెల్కోల నుంచి లక్షల్లో వలసలు

న్యూఢిల్లీ : ఉచితం, తక్కువ టారీఫ్‌ల పేరుతో మార్కెట్లోకి వచ్చిన రిలయన్స్ జియోకు ఇటీవల ఖాతాదారులు వరుసగా షాక్ ఇస్తున్నారు. ఈ ఏడాది జులైలో రిలయన్స్ జియో తొలుత భారీగా టారీఫ్‌లను పెంచడం.. ఆ బాటలోనే భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు 27 శాతం వరకు టారీఫ్‌లను పెంచేశాయి. దీంతో వినియోగదారులపై ఆర్థిక భారం నెలకొంది. చౌక ధరల్లో ప్లాన్లను అందిస్తున్న బిఎస్ఎన్ఎల్‌ను ఎంచుకుంటున్నారు. హెచ్చు ఛార్జీలతో అత్యధికంగా రిలయన్స్ జియో నష్టపోవడం విశేషం. మరోటెల్కో వొడాఫోన్ ఐడియా తన ఖాతాదారులను కోల్పోతోంది. అక్టోబర్ నెలలో ఎయిర్‌టెల్‌కు మాత్రం మద్దతు లభించింది. మరోవైపు ప్రభుత్వ టెలికం కంపెనీ బిఎస్ఎన్ఎల్‌లోకి వరుసగా నాలుగు నెలలుగా లక్షలాది మంది వచ్చి చేరుతున్నారు. ఈఏడాది అక్టోబర్ నెలలోనూ అదే రిపీట్ అయ్యింది. ప్రయివేటు టెల్కోలు జియో, వొడాఫోన్ ఐడియాలు భారీగా వినియోగదారులను కోల్పోయాయి. ఎయిర్‌టెల్ మాత్రం కొత్త ఖాతాదారులను జోడించుకోగలిగింది.

ట్రాయ్ గణంకాల ప్రకారం.. గడిచిన అక్టోబర్ నెలలో ఎయిర్‌టెల్ కొత్తగా 19.29 లక్షల ఖాతాదారులను పొందింది. ఇంతక్రితం నెలలో ఈ కంపెనీ 14.35 లక్షల మంది వినియోగదారులను పోగొట్టుకుంది. సెప్టెంబర్ నెలలో జియో దాదాపు 79.7 లక్షల మంది యూజర్లను కోల్పోగా.. అక్టోబర్‌లో మరో 37.60 లక్షల మంది ఆ నెట్‌వర్క్‌కు గుడ్‌బై చెప్పారు. వొడాఫోన్ ఐడియాను మరో 19.77 లక్షల మంది యూజర్లు ఆ నెట్‌వర్క్‌కు వీడారు.

బిఎస్ఎన్ఎల్‌లోకి 68 లక్షల మంది..

అక్టోబర్ నెలలో బిఎస్ఎన్ఎల్ కొత్తగా మరో 5 లక్షల మంది ఖాతాదారులను పొందింది. ఇంతక్రితం సెప్టెంబర్‌లో కూడా 8.5 లక్షల ఖాతాదారులను జోడించుకుంది. ఆగస్టులో 25.3 లక్షల మంది, అంతక్రితం నెల జులైలోనూ 29.3 లక్షల మంది కొత్తగా వచ్చి చేరారు. నాలుగు మాసాల్లో బిఎస్ఎన్ఎల్ 68 లక్షల పైనా ఖాతాదారులను సంపాదించుకుంది. టెలికం దిగ్గజం రిలయన్స్ జియో అక్టోబర్‌తో ముగిసిన నాలుగు మాసాల్లో మొత్తంగా 1.65 కోట్ల ఖాతాదారులను పొగొట్టుకుంది. దీంతో 39.9 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. ఎయిర్‌టెల్ 33.50 శాతం, వొడాఫోన్ ఐడియా 18.30 శాతం, బిఎస్ఎన్ఎల్ 8.50 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

4జితో మరింత జోరు..!

ప్రయివేటు టెల్కోలు అడ్డగోలుగా పెంచిన టారీఫ్‌లను వినియోగదారులు భరించలేక.. బిఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 4జి సేవలు విస్తృత స్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ ప్రభుత్వ రంగ సంస్థ ఖాతాదారులు మరింత పెరిగే అవకాశం ఉందని.. ప్రయివేటు టెల్కోల నుంచి భారీగా వలసలు ఉండొచ్చని అంచనా వస్తున్నారు.

వీసా లేకున్నా మలేషియాకు వెళ్లొచ్చు

న్యూఢిల్లీ : భారతీయులు మరో రెండేళ్ల వరకూ వీసా లేకున్నా మలేషియాకు వెళ్లొచ్చు. 2026 డిసెంబర్ 31 వరకూ వీసా లేకుండా తమ దేశంలో 30 రోజులు పర్యటించవచ్చని అక్కడి ప్రభుత్వం తెలిపింది. 2025 ఏషియన్ చాంపియన్ షిప్ చైర్మన్ షిప్ మలేషియాకు రానున్నది. ఈ నేపథ్యంలో మలేషియాలో పర్యటనకు ఏర్పాట్లు చేసుకోవచ్చునని మలేషియా హోంశాఖ సెక్రటరీ జనరల్ దాటుక్ అవాంగ్ అల్లిక్ జెమాన్ తెలిపారు. పర్యాటక రంగం విస్తరణ, ఆర్థిక వద్ధి ఉద్దీపనకు తొలుత 2023 లో మలేషియా వీసా మినహాయింపు ప్రక్రియ ప్రారంభించింది. చైనా పౌరులకు కూడా వీసా మినహాయింపునిచ్చింది మలేషియా పర్యాటక రంగానికి భారత ప్రయానికులు చాలా కీలకం.

హోండా, నిస్సాన్ కంపెనీల విలీనం

న్యూఢిల్లీ : జపాన్‌కు చెందిన రెండు దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీలు హోండా, నిస్సాన్ పరస్పరం విలీనం కానున్నాయి. ఈమేరకు ఇరు సంస్థలు విలీన ప్రణాళికలను ప్రకటించాయి. 2025 జూన్ నాటికి చర్చలు పూర్తి చేసి 2026 ఆగస్టు నాటికి విలీనాన్ని పూర్తి చేయాలని ఇరు కంపెనీలు నిర్దేశించుకున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) మార్కెట్లో పోటీతత్వాన్ని పెంచడం, టెస్లా, చైనా వాహన తయారీదారు బివైడి వంటి ప్రత్యర్థులను ఎదుర్కోవాలని భావిస్తున్నాయి. నిస్సాన్ జాయింట్ హోల్డింగ్ కంపెనీకి హోండా నాయకత్వం వహిస్తుందని హోండా ప్రెసిడెంట్ తోషిహిరో మిబే పేర్కొన్నారు. బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాలు తయారు చేయడంలో నిస్సాన్‌కు చాలా ఏళ్లుగా అనుభవం ఉందని.. ఇది హోండాకు దాని సొంత ఇవిలు, తదుపరి తరం హైబ్రిడ్ వాహనాలు అభివృద్ధి చేసుకోవడంలో సహాయపడుతుందన్నారు. ఆయన చెప్పారు. ఈ విలీనంతో దాదాపు రూ.4 లక్షల కోట్లకు పైగా విలువ చేసే కంపెనీగా ఏర్పడనుందని ఇరు సంస్థలు ప్రకటించాయి. దీంతో రెండు సంస్థలు అమ్మకాల పరంగా ప్రపంచంలో మూడో అతిపెద్ద వాహన తయారీదారుగా అవతరించనున్నాయి.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

E PROCUREMENT TENDER NOTICE

NIT No. 46/MAU61-EEOLS (OTH)/22/2024-RZLE, **Dt. 23.12.2024**

Name of Work: APCRDA - "Hiring of tractor mounted water tanker @ 5000 lts capacity for Watering in Capital City (FSA, East and West Park Roads)" **ECV: 13,24,490/-.** The bid can be downloaded on AP e-procurement portal **from 24.12.2024 to 08.01.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **08.01.2025 up to 15.00 Hrs.,** Technical bid opening **08.01.2025 @16.00Hrs.** For further details Please refer **www.crda.ap.gov.in** to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/-Commissioner, APCRDA, Vijayawada

ఫారం A
బహిరంగ ప్రకటన
(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రీజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 6 క్రింద)

యునైటెడ్ స్టీల్ బిల్డింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌యొక్క రుణదాతలు శ్రద్ధ వహించుటకు

	సంబంధిత వివరాలు	
1.	కార్పొరేట్ రుణగ్రహీత పేరు	యునైటెడ్ స్టీల్ బిల్డింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్
2.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క విలీనం తేది	29/07/2009
3.	కార్పొరేట్ రుణగ్రహీత అధికారం క్రింద విలీనం/నమోదు చేయబడింది	ఆర్ఓసి చెన్నై
4.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క కార్పొరేట్ గుర్తింపు నంబర్/లిమిటెడ్ లయబిలిటీ గుర్తింపు నంబర్	U28111TN2009PTC072418
5.	కార్పొరేట్ రుణగ్రత యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా) చిరునామా	న్యూ నెం.4, (ఓల్డ్ నెం.9) ఫ్లాట్ నెం.ఏ, బిగ్ స్ట్రీట్ కిల్‌పాక్ గార్డెన్ కాలనీ, కిల్‌పాక్ చెన్నై, తమిళనాడు - 600010
6.	కార్పొరేట్ రుణగ్రతకి సంబంధించి దివాలా ప్రారంభమైన తేది	18.12.2024 (21.12.2024న వెబ్‌సైట్‌లో ఆర్డర్ కాపీ అప్‌లోడ్ చేయబడింది)
7.	దివాలా తీర్మానం ప్రక్రియ మూసివేసే అంచనా తేది	16.06.2025
8.	వృత్తిసంబంధమైన తీర్మానం మధ్యంతరంగా వ్యవహరించే వృత్తిసంబంధమైన దివాలా పేరు మరియు నమోదు సంఖ్య	రమేల రంగసామి IBBI/IPA-002/IP-N00506/2017-2018/11700
9.	బోర్డ్‌తో నమోదుకాబడిన మధ్యంతర వృత్తిసంబంధమైన తీర్మానం చిరునామా మరియు ఇ-మెయిల్	ఏ6, ఆర్య హార్మొనీ అపార్ట్‌మెంట్, పోలీస్ కందసామి స్ట్రీట్, ఒలింపస్, రామనాథపురం, కోయంబత్తూరు, తమిళనాడు-641045
10.	మధ్యంతర వృత్తిసంబంధమైన తీర్మానంతో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించుటకు చిరునామా మరియు ఇ-మెయిల్	ఏఏఏ హౌస్, 64, ఓఖ్లా ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఓఖ్లా ఫేజ్ 3, మోడీ మిల్ దగ్గర, న్యూఢిల్లీ-110020
11.	దావాలు దాఖలు చేయుటకు చివరి తేది	04.01.2025
12.	రుణదాతల తరగతులు, ఏవైనా, మధ్యంతర తీర్మానం వృత్తిసంబంధమైన వాటి ద్వారా తెలిసినవి, సెక్షన్ 21 యొక్క సబ్-సెక్షన్ (6ఎ) యొక్క క్లాస్ (బి) క్రింద	వర్తించదు
13.	క్లాస్‌లో రుణదాతల అధీకృత ప్రతినిధిగా వ్యవహరించి దివాలా నిపుణులుగా గుర్తించిన పేర్లు (ప్రతి తరగతి కొరకు మూడు పేర్లు)	వర్తించదు
14.	(ఎ) సంబంధిత ఫారాలు మరియు (బి) అధీకృత ప్రతినిధులు వద్ద అందుబాటులో ఉండే వివరాలు:	వెబ్‌లింక్: https://ibbi.gov.in/home/downloads వర్తించదు

ప్రకటన ఇవ్వడమేమనగా **18.12.2024**న **"యునైటెడ్ స్టీల్ బిల్డింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్"** యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ప్రారంభమైనదిగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై డివిజన్ బెంచ్ కోర్టు ఆదేశించింది. (21.12.2024న వెబ్‌సైట్‌లో ఆర్డర్ కాపీ అప్‌లోడ్ చేయబడింది).
యునైటెడ్ స్టీల్ బిల్డింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క క్రెడిటర్లను రుజువులతో వారి క్లెయింలను **04.01.2025**న లేదా ముందుగా ఎంట్రీ నెం.10లో పేర్కొన్న చిరునామాలో ఇంటిరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు దాఖలుచేయవలెనని తెలియజేయడమైనది.
ఫైనాన్షియల్ క్రెడిటర్లు రుజువులతో వారి క్లెయింలను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే దాఖలుచేయాలి. అందరు ఇతర క్రెడిటర్లు రుజువులతోవారి క్లెయింలను నేరుగా, పోస్టుద్వారా లేదాఎలక్ట్రానిక్ విధానం ద్వారా దాఖలుచేయాలి. తప్పుడు లేదా తప్పుత్రోవ పట్టించు క్లెయిం దాఖలుచేయుట జరిమానాలు విధించబడతాయి.

సం/-
రమేల రంగసామి
ఇంటిరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్
Reg. No.: IBBI/IPA-002/IP-N00506/2017-2018/11700
ఏఎఫ్ఏ 31.12.2025 వరకు చెల్లుబాటు

తేది: 24-12-2024
ప్రదేశం: చెన్నై

సంపాదకీయం

ప్రజాస్వామ్యానికి ప్రమాదం

ఎన్నికలకు సంబంధించి సిసి టీవి ఫుటేజి, వెబ్ కాస్టింగ్, అభ్యర్థుల వీడియోలు ఇత్యాది ఎలక్ట్రానిక్ రికార్డుల తనిఖీని నిషేధించి మోడీ ప్రభుత్వం పారదర్శకతకు నిలువునా పాతరేసింది. కేంద్ర సర్కార్ ఈ చర్య ప్రజాస్వామ్యానికి, ఎన్నికల ఆధారిత పార్లమెంటరీ వ్యవస్థకు విఘాతం. 1961-ఎన్నికల నిర్వహణ నిబంధనల్లోని రూల్ 93(2)(ఎ) ప్రకారం ఎవరైనా ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులనూ తనిఖీ చేయడానికి అనుమతి ఉంది. ఇక నుంచి ఎలక్ట్రానిక్ రికార్డుల పరిశీలన కుదరదని కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఎన్నికల రూల్స్‌ను ఏకపక్షంగా మార్చిపడేసింది. ఒక కేసు కారణంగా ఎన్నికల సంఘం (ఇసి) సిఫారసు మేరకు రూల్స్ సవరించామన్న ప్రభుత్వ ఉటంకింపు ఈ దుర్మార్గంపై తనకెలాంటి సంబంధం లేదని తప్పించుకునే ఎత్తు మాత్రమే. ఇటీవలి హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి హర్యానా-పంజాబ్ హైకోర్టులో వేసిన కేసులో పిటిషన్‌దారు అభ్యర్థన మేరకు రికార్డులన్నింటినీ షేర్ చేయాలని న్యాయస్థానం ఇసి ని ఆదేశించింది. ఎన్నికల నిర్వహణ రూల్స్ ప్రకారం ఇవ్వాలని నిర్దేశించింది. కోర్టు తీర్పును అమలు చేయాల్సిన ఇసి, అందుకు భిన్నంగా రూల్స్ మార్చాలని అడిగిందే తడవు మోడీ ప్రభుత్వం శుక్రవారం ఆగమేఘాల మీద రూల్స్‌ను మార్చేసి న్యాయస్థానం ఆదేశాలను తుంగలో తొక్కింది. రికార్డులు పొందకుండా పిటిషన్‌దారు హక్కును కాలరాసింది.

రిగ్గింగ్, అవకతవకలు సహా ఎన్నికల్లో అక్రమాలను, నిరోధించేందుకు, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం సిసి టీవీలను, వెబ్ కాస్టింగ్‌ను కొన్నేళ్ల నాడు ఇసి ప్రవేశపెట్టింది. పోలింగ్‌కు ఆటంకాలు ఏర్పడ్డ సందర్భాల్లో అభ్యర్థుల, రాజకీయ పార్టీల ఫిర్యాదుల మేరకు వీడియోలను పరిశీలించి రీపోలింగ్‌కు ఇసి ఆదేశించింది కూడా. ఎన్నికల ప్రక్రియలో ఏ చిన్న మార్పు చేయాల్సి వచ్చినా రాజకీయ పార్టీలతో ఇసి విస్తృత సంప్రదింపులు జరపడం ఆనవాయితీ. కానీ ప్రస్తుత రూల్స్ మార్పుపై అటువంటిదేమీ లేదు. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించామని మాత్రమే పేర్కొంది. ఇసి ఇచ్చిన ఈ వివరణతో ఏకపక్షంగా రూల్స్ మారాయని అర్థమవుతుంది. రికార్డుల తనిఖీ వలన ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతుందని, వీడియోలను ఉపయోగించుకొని కృత్రిమ మేధ సహాయంతో పైరసీ వీడియోలు తయారు చేస్తున్నారన్న కేంద్ర ప్రభుత్వ, ఇసి వాదనలో పస లేదు. ఎన్నికల రికార్డులు బయట పడితే బిజెపికి ఇబ్బందికరమన్న భయంతోనే మోడీ సర్కార్ ఎలక్ట్రానిక్ రికార్డుల తనిఖీపై నిషేధం విధించిందన్నది ముమ్మాటికీ నిజం. అదే కాకపోతే రూల్స్ మార్పునకు ఎందుకంత తొందర?

మోడీ సర్కార్ ప్రభావంలో ఇసి పని చేస్తోందనడానికి గడచిన పదేళ్లల్లో ఎన్నో దృష్టాంతాలున్నాయి. ఎన్నికల కమిషనర్ల నియామకపు ప్యానెల్‌లో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌ను తొలగించడం పరాకాష్ట. ఇప్పుడు ఏకంగా హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా రూల్స్‌నే మార్చేసింది. సార్వత్రిక ఎన్నికల వరకు ఖాళీ అయిన కమిషనర్ల నియామకం చేపట్టకుండా తాత్సారం చేసింది. పదవీకాలం ఉన్నప్పటికీ ఒక కమిషనర్ తప్పుకోవడం మోడీ ప్రభుత్వ చలవే! రాగద్వేషాలకు అతీతంగా పని చేయాల్సిన కమిషనర్ పోస్టుల్లో తమకు అనుకూలమైన వారిని, ఆర్‌ఎస్‌ఎస్‌కు, హిందూత్వ పరివార్‌కు సన్నిహితంగా మెలిగే వారిని వేశారు. మహారాష్ట్ర, గుజరాత్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనలు, జమ్ము కాశ్మీర్ ఎన్నికల సుదీర్ఘ వాయిదా ఇసిపై మోడీ ప్రభుత్వ ప్రభావానికి తాజా ఉదాహరణలు. ఇవిఎంలు, వివిప్యాట్‌ల పనితీరులో సీక్వెన్స్‌ను మార్చాలన్న సిపిఎం అభ్యర్థనను ఇసి పట్టించుకోలేదు. ఇవిఎంల పనితీరుపై పలువురు లేవనెత్తుతున్న సందేహాలను సక్రమంగా నివృత్తి చేయట్లేదు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ వివరాలను వెల్లడించడం సాధ్యం కాదని ఇసి తెగేసి చెప్పింది. పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసంపైనా సరైన స్పందన లేదు. ఇవన్నీ ఇసి సమగ్రతను ప్రశ్నించేవే. స్వతంత్రంగా పని చేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ ఇసిపై ఇన్నేసి సందేహాలు రావడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇసిపై ప్రజలు విశ్వాసం కోల్పోతే రాజ్యాంగానికి ప్రమాదం. రాజకీయ పార్టీల, అభ్యర్థుల హక్కులను ప్రస్తుత నిబంధనల మార్పు చిదిమేస్తుంది. మోడీ ప్రభుత్వం ఆ సవరణలను ఉపసంహరించుకోవాలి. ఇసి నిర్వీర్యానికి మోడీ సర్కారు పన్నిన కుట్రలను పటాపంచలు చేసి ఇసి స్వతంత్రను ప్రజలే రక్షించుకోవాలి.

మహనీయుల మాట

విముక్తి ప్రసాదించే వారంటూ ఎవరూ ఉండరు. ప్రజలే తమను తాము విముక్తి చేసుకుంటారు.
- చే గువేరా

విశ్లేషణ

స్వర్ణాంధ్ర విజన్ పెట్టుబడులు - సమస్తం ప్రైవేటే

ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు తదితర అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, వాటి అనుబంధ సంస్థల నుండి భారీగా వివిధ రూపాల్లో నిధులు సేకరించబోతున్నారు. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు తమ రుణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై అనేక ఆంక్షలు పెడతాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పాత్రను బలహీనం చేసి ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని పెంచుతాయి. ముఖ్యంగా మౌలిక రంగాలు, పౌర సేవలను ప్రైవేటీకరించేందుకు తీవ్ర ఒత్తిడి చేస్తాయి. అంతేగాక రాష్ట్ర బడ్జెట్ ఆదాయ వ్యయాలను కూడా నియంత్రిస్తాయి. రాష్ట్ర ద్రవ్య, రెవిన్యూ లోటులను తగ్గించుకోవాలని షరతులు పెడతాయి. బడ్జెట్ లోటు తగ్గించుకోవాలంటే అనివార్యంగా ప్రజా సంక్షేమ పథకాలు, సబ్సిడీలలో కోత పెట్టాల్సిందే. రెండోవైపు ఆదాయం పెంచుకోవాలంటే ప్రజలపై వివిధ రకాల పన్నుల భారాలు అదనంగా పెంచాల్సిందే.

2029 నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువను రూ.29.29 లక్షల కోట్లకు పెంచాలనే లక్ష్యాన్ని స్వర్ణాంధ్ర విజన్ 2049లో పెట్టుకున్నారు. ప్రస్తుత స్థూల ఉత్పత్తి విలువను ఐదేళ్లలో రెట్టింపు చేయాలి. ఈ పెరుగుదల సాధించాలంటే వ్యవసాయ రంగం 11.05 శాతం, పారిశ్రామిక రంగం 16.15 శాతం, సేవా రంగం 17.95 శాతం చొప్పున మొత్తం సగటున ఏడాదికి 15 శాతం చొప్పున రాష్ట్ర వృద్ధి రేటు సాధించాలని నిర్ణయించారు. అందుకు మొత్తం ఐదేళ్లలో రూ.40.43 లక్షల కోట్లు పెట్టుబడులు అవసరమని ఇందులో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర బడ్జెట్ నుండి రూ.9.29 లక్షల కోట్లు (23 శాతం), మిగిలిన రూ.31.14 లక్షల కోట్లు (77 శాతం) ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి), అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ద్వారా సమకూరుతుందని తెలిపారు.

డా॥ బి. గంగారావు

ప్రభుత్వం ఆశించిన ఈ మొత్తం పెట్టుబడి మన రాష్ట్ర బడ్జెట్‌కి 15 రెట్లకు, రాష్ట్ర స్థూల ఉత్పత్తికి మూడు రెట్లకు సమానం. ఇంత పెట్టుబడిని సమీకరించటం సాధ్యమా? ఎప్పటికీ సాధ్యం కాదు. కనీసం అందులో 10 శాతం కూడా సమకూరటం అసాధ్యం. ఉదాహరణకు రాష్ట్ర ప్రభుత్వం రాబోయే ఐదేళ్లలో రూ.4.8 లక్షల కోట్లు రాష్ట్ర బడ్జెట్ నుండి పెట్టుబడులు పెడుతుందని పేర్కొన్నది. రాష్ట్ర విభజన తరువాత గడిచిన పదేళ్లలో బడ్జెట్ నుండి ఎంత పెట్టుబడి వ్యయం చేశారు? టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాలు కలిపి కేవలం రూ.లక్షా 25 వేల కోట్ల లోపే చేశాయి. ఇందులో రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న కొన్ని నిధులు, పోలవరం, అమరావతి వంటి వాటిపై చేసిన వ్యయం కూడా కలిసి ఉంది. కనుక తీవ్ర నిధులు సమస్యను ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని పెట్టుబడులు తన బడ్జెట్ నుండి పెడుతుందనేది ఒక కల మాత్రమే. ప్రజలను మభ్య పెట్టటానికే. అయితే ఎన్ని లక్షల కోట్లు వస్తాయో అనే చర్చ కన్నా ఈ పెట్టుబడుల సమీకరణకు ఎంచుకున్న వ్యూహం, విధానాలు రాష్ట్రానికి, ప్రజలకు అత్యంత ప్రమాదకరమైనవి.

పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ విజన్ తీసుకురావాలనుకుంటున్న విధానాలు, మార్పులు తీవ్ర ప్రమాదకరమైనవిగా ఉన్నాయి. పట్టణ కేంద్రాలను ఆర్థిక వృద్ధికి చోదక శక్తులుగా మార్చాలంటూ ప్రత్యేకంగా అమరావతి, విశాఖపట్నం, కర్నూల్, తిరుపతి, కాకినాడ నగరాలు వాటి చుట్టూ వున్న పరిసర ప్రాంతాలపై ప్రత్యేక కేంద్రీకరణ చేసి దీనిని సాధించాలని అంటున్నారు. ప్రైవేట్ పెట్టుబడులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలకు, వాటి కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు ప్రత్యేక పట్టణ సమీకృత మాస్టర్ ప్రణాళికలు తయారు చేసి, వాటి అమలుకు ప్రత్యేకంగా ప్రాంతీయ అభివృద్ధి సంస్థలను నెలకొల్పబోతున్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న ప్రతి పట్టణం, దాని చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాల పరిధిలో ఉన్న భూమి వివరాలను, ప్రస్తుత వినియోగం వంటి వివరాలను పూర్తిగా సేకరించి డిజిటలైజ్ చేసి పెట్టుబడి కార్యకలాపాలకు ఉపయోగించాలని పేర్కొన్నారు.

రాబోయే ఐదేళ్లలో కనీసం ఐదుకు పైగా పెద్ద నగరాలను మురికివాడలు లేని నగరాలుగా మార్చాలన్న లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ భూములు అత్యంత ఖరీదైనవి. ప్రైవేట్ పెట్టుబడుల వ్యాపార వాణిజ్య కార్యకలాపాల విస్తరణకు, లాభాలు పోగేసుకోటానికి అనువైనవి. అంటే మురికివాడల ప్రజలను నగర శివార్లకు తరలించి ఆ భూములను ప్రైవేట్ వ్యాపార వాణిజ్య సంస్థలకు ధారాదత్తం చేస్తారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అనేక నగరాల్లో ఈ విధానాన్ని అమలు చేసిన దాఖలాలు ఉన్నాయి.

ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పి.పి.పి) ద్వారా పెద్ద ఎత్తున ప్రైవేట్ పెట్టుబడులు సమీకరించాలనేది ఈ విజన్ ముఖ్య ఉద్దేశ్యం. ఇది అత్యంత ప్రమాదకరమైనది. విజన్ పత్రంలో పేర్కొన్న అన్ని రంగాల్లో ఈ విధానం కనిపిస్తుంది. చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన తరువాత పదే పదే పబ్లిక్, పీపుల్, ప్రైవేట్ పార్టిసిపేషన్ (పి4)ను ముందుకు తీసుకొస్తున్న విషయం తెలిసిందే. పి.పి.పి మరియు పి4 మధ్య పెద్దగా తేడా లేదు. రెండు ఒకటే. ప్రజలు అంటే ఎన్జీవోలు లేదా స్టేక్ హోల్డర్లు లేదా పౌర సంఘాలు. సూచనలు, సలహాల వరకే వీటిల్లో వీరిని భాగస్వామ్యం చేస్తారు తప్ప నిర్వహణ, నిర్ణయాల్లో భాగస్వామ్యం ఉండదు. వీటిపై వీరికి ఎటువంటి హక్కులు, అధికారాలు, పర్యవేక్షణ పాత్ర ఉండదు.

ఈ విధానంలో కొత్తగా చేపట్టబోయే ప్రాజెక్టులకు ప్రభుత్వం భూములను ప్రైవేట్ సంస్థలకు పెద్ద ఎత్తున కేటాయిస్తుంది. ఆ ప్రాజెక్టులకు అవసరమైన అన్ని రకాల రోడ్లు, విద్యుత్, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు, ఇతర రాయితీలు కూడా ప్రభుత్వమే కల్పిస్తుంది. అందుకు ప్రైవేట్ సంస్థ తనకు వచ్చే ఆదాయంలో కొంత వాటా మాత్రమే ప్రభుత్వానికి ఇస్తుంది. నష్టాలు ప్రభుత్వం భరిస్తుంది. అనేక పన్ను మినహాయింపులు ఉంటాయి. లాభసాటిగా లేకపోతే ఎప్పుడైనా ఈ ప్రాజెక్టును వదిలేసే స్వేచ్ఛ కూడా ఉంటుంది. అందువల్ల పెట్టుబడిదార్లకు ప్రభుత్వ ఆస్తులను దోచిపెట్టేందుకే పి.పి.పి ని తీసుకొస్తున్నారు. ఇది ప్రపంచ బ్యాంక్ నమూనా.

ఇప్పుడు రాష్ట్ర పరిధిలో ఉన్న పెద్ద రోడ్లను కూడా కేంద్ర జాతీయ రహదారుల వలే పి.పి.పి కింద నిర్మించాలని, వాటికి టోల్ గేట్లు పెట్టి వాహనదారుల నుండి ఫీజుల రూపంలో ఆదాయం రాబట్టాలని నిర్ణయించింది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి కొన్ని మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ప్రయోగాత్మకంగా వ్యాపార, వాణిజ్య కార్య కలాపాలు ప్రబలంగా ఉండే రోడ్ల నిర్వహణను పి.పి.పి కింద ప్రైవేట్ సంస్థలకు ఇవ్వబోతున్నట్లు చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆ తరువాత అన్ని మున్సిపల్ పట్టణాల్లో ఈ విధానాన్ని అమలులోకి తెస్తారు.

ప్రభుత్వ భూములను పూర్తిగా పెట్టుబడి సరుకుగా మార్చాలని, దీని ద్వారా ఎక్కువ ఆదాయాన్ని రాబట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వ భూములు ప్రజావసరాలకు వినియోగించడం కన్నా ప్రైవేట్ పెట్టుబడుల వ్యాపార కార్యకలాపాలకు కేటాయించటమే ప్రభుత్వ ప్రధాన విధానంగా మారబోతున్నది. ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల కింద ఉన్న ఆస్తులను కూడా ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసి తద్వారా ఆదాయాన్ని పెంచుకోబోతునట్లు విజన్‌లో నొక్కి చెప్పారు.

ముఖ్యంగా లక్షల కోట్ల విలువైన ప్రజా మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున ప్రైవేట్ రంగానికి బదిలీ చేయడంపై విజన్ కేంద్రీకరించింది. కేంద్ర బిజెపి గత పదేళ్ల నుండి పెద్ద ఎత్తున కేంద్ర పరిధిలోని మౌలిక సదుపాయాలను కార్పొరేట్ల కట్టబెడుతున్న విషయం తెలిసిందే. వికసిత్ భారత్‌లో కూడా ఈ విధానాన్ని ముందుకు తీసుకొచ్చారు. ఇప్పుడు ఇదే విధానాన్ని విజన్ రూపంలో రాష్ట్రంలో అమలుకు పూనుకున్నారు.

ఎందుకంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వాలే పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేస్తూ వస్తున్నాయి. కేంద్ర పరిధిలోనే గాక రాష్ట్రాల పరిధిలో కూడా అనేక రూపాల్లో ఇవి అభివృద్ధి చేయబడ్డాయి. ప్రైవేట్ పాత్ర ఈ రంగంలో ఇప్పటికీ నామమాత్రమే. ప్రభుత్వ పెట్టుబడిదే పూర్తి గుత్తాధిపత్యం. అయితే ఈ రంగాన్ని పూర్తిగా తమ వశం చేసుకోవటానికి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి. నయా ఉదారవాద విధానాల్లో ఈ రంగాన్ని ప్రైవేట్ రంగానికి అప్పజెప్పాలనేది ముఖ్యమైనది కూడా. ముఖ్యంగా మున్సిపల్ రంగంలో మంచినీరు, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, ఉద్యాన వనాలు, క్రీడా స్థలాల, కళ్యాణ మండపాలు, ఆడిటోరియంలు, ఖాళీస్థలాలు ఇటువంటివన్నీ ఈ విజన్ వ్యూహంలో ప్రైవేట్ శక్తుల చేతుల్లో పెట్టబడతాయి.

ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు తదితర అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, వాటి అనుబంధ సంస్థల నుండి భారీగా వివిధ రూపాల్లో నిధులు సేకరించబోతున్నారు. వాస్తవంగా 2049 విజన్ పత్రం పూర్తిగా వారి కనుసన్నల్లోనే రూపుదిద్దుకుంది. ఈ సంస్థల నుండి విద్య, ఆరోగ్యం, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల రంగాల్లో నిధులు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సంస్థలు ఇచ్చే నిధులు, రుణాలు అన్నీ సంస్కరణలతో కూడుకున్నవే. ఇప్పటికే అనేక రంగాల్లో ఒప్పందాలు చేసుకొని ఆంధ్ర రాష్ట్రానికి రుణాలు ఇచ్చాయి. తాజాగా అమరావతి నిర్మాణానికి కూడా దాదాపు రూ.20 వేల కోట్ల రుణాన్ని ఇవ్వటానికి అంగీకరించాయి. మున్సిపల్ రంగంలో ఈ సంస్కరణలు కొన్ని ఇప్పటికే అమలు కూడా చేస్తున్నారు. ఈ విజన్‌తో ఇంకా ఈ రంగంలో ఈ సంస్కరణలు వేగంగా అమలు జరుగుతాయి. విద్య, ఆరోగ్య రంగాల్లో అనేక రూపాల్లో ప్రైవేటీకరణ విధానాలు అమలులోకి తీసుకొస్తారు. విద్యుత్ పూర్తిగా కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యంలోకి వెళ్తుంది. ఈ రంగంలో దుష్ఫలితాలను ఇప్పటికే చూస్తున్నాం.

అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు తమ రుణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై అనేక ఆంక్షలు పెడతాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పాత్రను బలహీనం చేసి ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని పెంచుతాయి. ముఖ్యంగా మౌలిక రంగాలు, పౌర సేవలను ప్రైవేటీకరించేందుకు తీవ్ర ఒత్తిడి చేస్తాయి. అంతేగాక రాష్ట్ర బడ్జెట్ ఆదాయ వ్యయాలను కూడా నియంత్రిస్తాయి. రాష్ట్ర ద్రవ్య, రెవిన్యూ లోటులను తగ్గించుకోవాలని షరతులు పెడతాయి. బడ్జెట్ లోటు తగ్గించుకోవాలంటే అనివార్యంగా ప్రజా సంక్షేమ పథకాలు, సబ్సిడీలలో కోత పెట్టాల్సిందే. రెండోవైపు ఆదాయం పెంచుకోవాలంటే ప్రజలపై వివిధ రకాల పన్నుల భారాలు అదనంగా పెంచాల్సిందే. ఇప్పటికే ఈ పరిణామాలు చూస్తున్నాం. ఈ విజన్ ఈ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళుతుంది.

స్థూలంగా చూస్తే చంద్రబాబు కూటమి విజన్ 2047 వర్గ దోపిడీ విజన్. కొద్ది మంది చేతుల్లో ఆస్తులు, సంపద పోగుపడేందుకు, ప్రభుత్వ ఆస్తులు, సహజ వనరులు, మౌలిక సదుపాయాలు, సేవలపై ఈ శక్తుల గుత్తాధిపత్యం పెంచేది. అన్ని రంగాలను కొల్లగొడతారు. వీరి అవసరాలకు అనుగుణంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏ హక్కులు లేని, దోపిడీకి గురయ్యే కార్మిక వర్గాన్ని, నిరుద్యోగ యువతను పెంచుతుంది. ప్రజలపై తీవ్ర భారాలు మోపుతుంది. పేదరిక నిర్మూలన, ఇంటికో పారిశ్రామికవేత్త కలగానే మిగిలి ఉన్న కొద్దిపాటి ఆస్తులు కోల్పోయి వలస కూలీలుగా మారే క్రమాన్ని విస్తరిస్తుంది. అసమానతలు పెరుగుతాయి. వెనుకబడిన ప్రాంతాలు మరింత నిర్లక్ష్యానికి, దోపిడీకి గురవుతాయి. కనుక ఇది స్వర్ణాంధ్ర విజన్ 2047 ముసుగులో చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ప్రజలపై విసిరిన రంగుల మాయాజాల వర్గ దోపిడీ పంజా. ఈ దోపిడీ వ్యూహాన్ని, కుట్రను వెనక్కి కొట్టడమే రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యం.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

సందర్భం

గొప్ప దార్శనికుడు పెరియార్

ఆత్మాభిమానం గల హేతువాదిగా పెరియార్ భారతీయ సమాజంలోని నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను తీవ్రంగా నిరసించాడు. అధిక సంఖ్యాకులు శూద్రులుగా అవమానాలకు గురికావడం, మరికొంత మంది అస్పృశ్యులుగా బానిసలకన్నా హీనంగా బతకడం ఆయన సహించలేకపోయాడు. తన పేరులో కులాన్ని తెలిపే 'నాయకర్'ను వదిలేశాడు. ఆత్మగౌరవ ద్రవిడ ఉద్యమానికి రూపకల్పన చేశాడు.

మూఢనమ్మకాల్ని, అర్థం లేని సంప్రదాయాల్ని దునుమాడిన వాడు, ద్రవిడ ఉద్యమ పితామహుడైన ఇ.వి.రామస్వామి (17 సెప్టెంబర్ 1879-24 డిసెంబర్ 1973) అందించిన స్ఫూర్తి దేశానికే పరిమితం కాలేదు. అది ఖండాంతరాలకు పాకింది.

1977లో మద్రాస్ హైకోర్టుకు ఒక పిటిషన్ వచ్చింది-తమిళనాడులో పెరియార్ విగ్రహాల కింద రాసిన వాక్యాలు ప్రమాదకరంగా ఉన్నాయనీ, అవి ప్రజల ధార్మిక భావనల్ని దెబ్బ తీస్తున్నాయని-అందువల్ల వాటిని వెంటనే తొలగించాలన్న ఆదేశాలు కోర్టు ఇవ్వాలని- ఆ పిటిషన్ సారాంశం! అందుకు కోర్టు స్పందించింది. వాదనలు, ప్రతి వాదనలు విన్న తరువాత ఇలా తీర్పిచ్చింది- ఇ.వి.రామస్వామి పెరియార్ ఏ ఆలోచనా ధోరణితో ఉండేవాడో, ఆ ఆలోచనలనే ఆయన విగ్రహం కింద చెక్కించి పెట్టారు. అందులో తప్పేముంది? పెరియార్ చెప్పని మాటలు ఆయన విగ్రహం కింద చెక్కించలేదు కదా? ఇష్టమైన వారే చదువుకుంటారు. ఇష్టంలేని వారు మానేస్తారు. అందులో బలవంతం ఏమీ లేదు కదా? ఇంకా అభ్యంతరం ఎందుకూ?-అని కోర్టు ప్రశ్నించింది. 'పెరియార్ విగ్రహం కింద చెక్కించి పెట్టిన వాక్యాలు తొలగించనవసరం లేదు' అని కోర్టు తీర్పు చెప్పింది. విగ్రహాల కింద అమర్చిన ఫలకాల మీద పెరియార్ మాటలు ఇలా ఉన్నాయి. "దేవుడు లేడు-దేవుడు లేనే లేడు!! దేవుడు ఉన్నాడనుకుని దేవుణ్ణి సృష్టించిన వాడు మూర్ఖుడు. ఆ భావాన్ని ప్రచారం చేసేవాడు దుర్మార్గుడు. ఇక దేవుణ్ణి పూజించే వాడయితే పరమ నికృష్టుడు."

డా॥ దేవరాజు మహారాజు

దేవుణ్ణి దృష్టిలో ఉంచుకుని పెరియార్ ఒక పదిహేను ప్రశ్నలు సంధించాడు. అవి ఆ కాలంలోనే సమాజాన్ని అతలాకుతలం చేశాయి. దేవుణ్ణి అమితంగా ఆరాధించేవారు ఆ ప్రశ్నలు తెలుసుకోకపోవడమే మంచిది. అనవసరంగా వారు, వారి మనోభావాలు దెబ్బతీసుకోకపోతేనే మంచిది. నిజాల్ని నమ్మేవారు, వాస్తవం తెలుసుకుందామని అనుకునే వారు మాత్రమే పెరియార్ ప్రశ్నల గురించి తెలుసుకోవాలి. ఆ ప్రశ్నలు నిత్య నూతనం - దేవుడికి పెరియార్ సంధించిన ప్రశ్నలు ఇలా ఉన్నాయి.

- నువ్వేమైనా పిరికివాడివా? ఎవరికీ కనపడకుండా ఎందుకు దాక్కుంటావు? ఎవరి ముందుకూ ఎందుకు రావు?
- రాత్రింబవళ్ళు పూలు, అర్చనలు చేయించుకుంటూ వుంటావు, పొగిడించుకోవడమంటే నీకు అంత ఇష్టమా?
- యేం? నీకు అంత ఆకలిగా ఉంటుందా? జనాల నుండి ఎప్పుడూ మిఠాయి, పాయసం, పాలు, నెయ్యి స్వీకరిస్తూనే ఉంటావు?
- నువ్వేమైనా బంగారంతో వ్యాపారం చేసే వాడివా? నీ గుళ్ళలో ఎక్కడికక్కడ లక్షల టన్నుల బంగారం నొక్కేసుకుంటావ్?
- నువ్వేమైనా వ్యభిచారివా? ఆలయాల్లో దేవదాసీలను ఉంచుకుంటావ్?
- ఇంత బలహీనుడివా? నీ ఎదుట రోజూ సమాజంలో జరుగుతున్న రేప్‌లు, శారీరక హింసలు ఆపలేకపోతున్నావ్?
- నువ్వేమైనా మూర్ఖుడివా? ప్రపంచంలో ఇంత పేదరికం ఉంటే, సమయానికి ఇంత ముద్ద దొరకని పేదలుంటే, అన్నీ చూస్తూ కూడా అన్నం, పాలు, నెయ్యి, నూనె అన్నీ నదుల్లో పారబోయిస్తున్నావ్?
- నువ్వేమైనా చెవిటివాడివా? అకారణంగా చనిపోతున్న మనుషుల ఆర్తనాదాలు, బలత్కారానికి గురవుతున్న పసికూనల ఏడ్పులు పెడబొబ్బలు వినిపించడం లేదా?
- నువ్వేమైనా గుడ్డివాడివా? రోజూ ఇన్నిన్ని అపరాధాలు జరుగుతూ ఉంటే-నీకేమీ కనిపించడం లేదా?
- నువ్వేమైనా టెర్రరిస్టులతో కుమ్ముక్కయ్యావా? ధర్మం పేరుతో ప్రతిరోజూ లక్షల మందిని చంపిస్తున్నావు?
- లేక-నువ్వే ఓ మతోన్మాదివా? ఉగ్రవాదివా? నిన్ను చూసి అందరూ భయపడతూ ఉండాలని కోరుకుంటున్నావా?
- నువ్వేమైనా మాటలు రాని మూగవాడివా? ఏ విషయం గూర్చీ ఒక్క మాట కూడా మాట్లాడవు. కోట్ల మంది లక్షల ప్రశ్నలు గుప్పిస్తున్నా, నీ దగ్గర దేనికీ ఒక్క సమాధానమైనా ఉండదా?
- నువ్వేమిటీ? అవినీతిలో అంతగా మునిగిపొయ్యావా? పేదసాదలకు ఎప్పుడైనా, ఏమైనా ఇచ్చావా? ఇవ్వక పోగా, వారు పశువుల్లాగా కష్టపడి సంపాదించిందంతా తెచ్చి నీ కోసం ఖర్చు చేస్తున్నారే? నీకేమీ అనిపించడం లేదా?

నేడు పెరియార్ వర్ధంతి

పెరియార్ సంధించిన ఈ ప్రశ్నలకు దేవుడు ఎలాగూ సమాధానమివ్వలేడు. దేవుడి వకాల్తా పుచ్చుకుని శివాలూగే వారైనా చెప్పాలి కదా? చెప్పలేదు-పెరియార్ కాలం నుండి ఈ నాటి దాకా ఎవరూ ముందుకు రాలేదు. మనోభావాలు దెబ్బతిన్నాయని యాగీ చేయడమో, ప్రత్యర్థుల మీద బూతుల వర్షం కురిపించడమో కాదు కావాల్సింది. సంధించిన ప్రశ్నలకు అర్థముందా లేదా? ఉంటే, మనం కూడా ఆ విధంగా ఎందుకు ఆలోచించడం లేదూ అని ఆత్మవిమర్శ చేసుకోవాలి. బూజు పట్టిన భావజాలాన్ని మార్చుకునే ప్రయత్నం చేయాలి.

ఆత్మాభిమానంగల హేతువాదిగా పెరియార్ భారతీయ సమాజంలోని నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను తీవ్రంగా నిరసించాడు. అధిక సంఖ్యాకులు శూద్రులుగా అవమానాలకు గురికావడం, మరికొంత మంది అస్పృశ్యులుగా బానిసలకన్నా హీనంగా బతకడం ఆయన సహించలేకపోయాడు. తన పేరులో కులాన్ని తెలిపే 'నాయకర్'ను వదిలేశాడు. ఆత్మగౌరవ ద్రవిడ ఉద్యమానికి రూపకల్పన చేశాడు. 'వివేకం ఏ మాత్రం లేని జంతువుల్లో విభజనలు లేవు. బ్రాహ్మణ కుక్క, శూద్ర కుక్క, పరియ (అస్పృశ్య) కుక్క అని విడివిడిగా లేవే? గాడిదల్లో, కోతుల్లో ఇలాంటి విభజనలు లేవే?' అని పెరియార్ ఆవేదన చెందాడు. హేతువాదమంటే ఏమిటో తెలియని పక్షుల్లో క్రిమికీటకాల్లో విభజన చేసి, అధిక సంఖ్యాకుల్ని ఎందుకు హింసిస్తున్నట్టూ? బ్రాహ్మణుడికి గౌరవనీయ స్థానమెందుకూ? అతని కాళ్ళు కడిగి, ఆ నీళ్ళు తాగడమెందుకూ? పెళ్ళిళ్ళలో, శోభన కార్యక్రమాల్లో, నామకరణం, గృహ ప్రవేశం-బతుకులో, చావులో బ్రాహ్మణుడికి ఆధిపత్య పాత్ర ఎందుకుందీ? ఎక్కడి నుంచో వలస వచ్చి ఇక్కడి మూలవాసుల మీద, ద్రావిడుల మీద అధికారం వెలగబెడుతున్న ఈ ఆర్య బ్రాహ్మణుల కుట్రలు బట్టబయలు చేయకుండా ఇంకా నిశ్శబ్దంగా భరిస్తూ ఉండాలా? అని ప్రశ్నించాడాయన! బ్రాహ్మణులు చెప్పారనే కదా? వారు చేసిన కుట్రలు గ్రహించకుండా, నిర్జీవ ప్రతిమలకు భజనలు చేస్తూ బతుకు బాగుపడుతుంది-అనుకుంటున్నారు. అలా ఎన్నటికీ జరగదు. పోరాటాలు చేసి హక్కులు సాధించుకోవాల్సిందే!

పెరియార్ జస్టిస్ పార్టీ ప్రారంభించక ముందు 1926-32 మధ్య కాలంలో మలేసియా, యూరోప్, సోవియట్ యూనియన్ వంటి అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తను చేపట్టిన ఆత్మగౌరవ ఉద్యమం గురించి, నిరీశ్వరవాదం గురించి ప్రసంగించాడు. 1939లో జస్టిస్ పార్టీ స్థాపించి, 1944లో దాని పేరు ద్రవిడ కజగంగా మార్చాడు. ఇటీవల సనాతన ధర్మం మీద తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు దేశంలో ఎంత దుమారం లేపాయో మనం చూశాం. అంటే పెరియార్ భావజాలం ఆయన మరణాంతరం కూడా ప్రశ్నలు రేకెత్తిస్తూనే ఉందన్నమాట! మనువాదుల్ని వణికిస్తూనే ఉందన్నమాట! ఈ అత్యాధునిక కాలానికి కూడా పెరియార్ అవసరం ఇంకా చాలానే ఉంది!

/ వ్యాసకర్త సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త-మెల్బోర్న్ నుంచి/

జనవాక్యం

కాలేజీ విద్యార్థులకూ 'మధ్యాహ్న' పథకం

రాష్ట్రంలోని 164 మండలాల్లోని ప్రభుత్వ మోడల్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరుతున్నాం. ఈ మోడల్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్న భోజనం అమలవుతున్నది. కనుక ఇదే పాఠశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం అమలు పరచడంలో సమస్యలు ఉండవు. పైగా ప్రభుత్వం ఈ పథకాన్ని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా అమలు చేయాలని కోరుతున్నాం. సుదూర ప్రాంతాల నుండి మండలంలో ఉన్న కళాశాలలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే మోడల్ స్కూళ్లు నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలు.

- బి. సురేష్,
మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్ కమిటీ.

'సెకి'తో ఒప్పందం వద్దు

గత ప్రభుత్వం సోలార్ విద్యుత్ సరఫరా కోసం సెకి సంస్థతో చేసుకున్న ఒప్పందంలో అవినీతి చోటు చేసుకోవటమే కాకుండా రాష్ట్రానికి అధిక మొత్తంలో భారం పడుతుంది. ఒప్పందం రద్దు చేయకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ వ్యవహారంలో కేంద్రం ఒత్తిడికి తలొగ్గినట్లు ప్రజలు భావించే ప్రమాదం ఉంది. గతంలో ప్రత్యేక హోదా విషయంలో కూడా చంద్రబాబు నాయుడు గారు అపఖ్యాతి పాలయ్యారు. సెకి ఒప్పందం రద్దు చేసుకుంటే చెల్లించవలసిన పరిహారం న్యాయస్థానంలో తేల్చుకోవచ్చు! ఒప్పందమే అవినీతి అయినప్పుడు షరతులకు చట్టబద్ధత లేదు.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా.

ఆహార సలహా సంఘాల జాడేదీ.?

- పౌరసరఫరాల్లో పెరుగుతున్న అక్రమాలు
- యథేచ్ఛగా కల్తీ విక్రయాలు
- అధికారుల్లో కొరవడిన పర్యవేక్షణ

ప్రజాశక్తి-హిందూపురం (సత్యసాయి జిల్లా)

తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ సక్రమంగా అందించడంతో పాటు ఎక్కడా అక్రమాలు జరగరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసింది. ఇవి ప్రతి నెల రేషన్ పంపిణీని పర్యవేక్షించాలి. అలాగే సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు చేయాలి. గత ప్రభుత్వం ఒక సారి సమావేశం ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా ముగించింది. అసలు రెవెన్యూ అధికారులు ఈ సంఘాలను ఏర్పాటు చేశారా? అన్న అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి వరకు ఒక్క సమావేశం కూడా నిర్వహించ లేదు. దీంతో ఈ సంఘాలు కనుమరుగయ్యాయి. దీంతో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మార్కెట్లో సరుకుల తూకాల్లో తేడాలు, హోటళ్లలో ఆహార పదార్థాల కల్తీ మయం, చౌకధర దుకాణాల్లో సక్రమంగా కార్డుదారులకు అందని బియ్యం ఇలా ఒకటేమిటి అనేక రూపాల్లో వినియోగదారులు మోసపోతున్నారు.

ఆహార సలహా సంఘం పనితీరు

ఆహార సలహా సంఘానికి ఛైర్మన్‌గా మండల తహశీల్దార్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎంపిపి, జడ్‌పిటిసి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వినియోగదారుల సంఘాలు, వివిధ పార్టీల ప్రతినిధులు ఉంటారు. ఆహార సలహా సంఘం ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమై ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలి. అయితే అధికారులు పట్టించుకోకుండా ఆహార సలహా సంఘాలను నిర్వీర్యం చేశారు.

రేషన్ సరుకుల్లోనూ కోత

గతంలో రేషన్ షాపుల్లో తెల్ల కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమలు, కారంపొడి, ఆయిల్, ఉప్పు, చింత పండు, కిరోసిన్, చక్కెర తదితర వస్తువుల పంపిణీ చేసేవారు. గత ప్రభుత్వం కార్డు దారులందరికీ కేవలం బియ్యం అప్పుడప్పుడు చక్కెర, బ్యాళ్లు మాత్రమే అందించారు. వీటిని సైతం పూర్తి స్థాయిలో అందించడం లేదు. రేషన్ సరుకుల పంపిణీలో కార్డుదారుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు ఆహార సలహా సంఘాలు నిర్దేశించాల్సి ఉంది. ఆహార సలహా సంఘాల జాడ లేకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి అవి సక్రమంగా పని చేసే విధంగా చూడాలని బాధ్యత వుంది.

అధిక ధరలకు విక్రయాలు

పలువురు వ్యాపారులు నిత్యావసర వస్తువులకు కృత్రిమకొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసి నాసిరకం సరుకులు అంటగడుతున్నారన్న ఆరోపణలు ప్రజల్లో వినపడుతున్నాయి. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా గోదాముల నుంచి రేషన్ షాపులకు సరఫరా అవుతున్న సరుకులలో తరుగు ఉంటుందని రేషన్ డీలర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. వీటి నియంత్రణకు జిల్లాలో ఎక్కడా ఆహార సలహా సంఘం కానరావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీలర్ల చేతివాటం

పట్టణం, మండల వ్యాప్తంగా కొన్ని రేషన్ షాపుల డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ప్రభుత్వం అప్పుడప్పుడు చక్కెర, బ్యాళ్లు మాత్రమే కార్డుదారులకు అందిస్తుంటే దీనికి డీలర్లు వ్యాపారంలో కుమ్మక్కై వీటికి తోడు అదనంగా కొన్ని సరుకులు అంటగడుతున్నారు. అవి కూడా మార్కెట్ రేట్ ప్రకారమే వసూలు చేయడంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు.

కమల్ అద్వాన్ ఆస్పత్రిపై భీకర దాడులు

- భీతిల్లుతున్న పేషెంట్లు
- గాజా గజ గజ

గాజా : ఉత్తర గాజాలో పనిచేస్తున్న రెండు ఆస్పత్రుల్లో ఒకటైన కమల్ అద్వాన్ ఆస్పత్రి లక్ష్యంగా ఇజ్రాయిల్ భయంకరంగా దాడులు కొనసాగిస్తునే వుందని, అక్కడి పరిస్థితులు భయానకంగా వున్నాయని ఆ ఆస్పత్రి డైరెక్టర్ హుస్సేన్ అబూ సయీఫ్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే చాలా జాప్యం జరిగిందని, ఇంక ఆలస్యం చేయకుండా వెంటనే అంతర్జాతీయ సమాజం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో పరిస్థితులు చాలా ప్రమాదకరంగా, భీతి గొలిపేలా వున్నాయని చెప్పారు. కాగా ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకోలేదంటూ ఇజ్రాయిల్ మిలటరీ ప్రతినిధి తిరస్కరించారు. ఆస్పత్రిపై దాడి జరిగినట్లే తెలియదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 91మంది రోగులు చికిత్స పొందుతున్నారని, సోమవారం ఇజ్రాయిల్ డ్రోన్‌లతో ఆస్పత్రిపై దాడి జరిగిందని సయీఫ్ చెప్పారు. ఆదివారం రాత్రంతా ఈ దాడులు కొనసాగాయన్నారు. ఐసియును, ప్రసూతి వార్డు, ఆపేషన్ థియటర్‌లను బుల్లెట్లు తాకాయని, దీంతో రోగుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయని ఆయన చెప్పారు. జనరేటర్ కూడా దెబ్బతిందన్నారు. లోపల వున్న రోగులందరినీ చంపేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ దాడులు కొనసాగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

వణుకుతున్న ప్రజలు

శీతల గాలులు పాలస్తీనియన్లను గజ గజ వణికిస్తున్నాయి. గత 14 మాసాలుగా కొనసాగుతున్న ఇజ్రాయిల్ సైనిక దాడుల్లో దాదాపు 20లక్షల మంది పాలస్తీనియన్లు నిర్వాసితులయ్యారు. వీరందరూ సరైన నివాసాలు లేక ఆరు బయట వుండాల్సిన పరిస్థితులు కూడా నెలకొన్నాయి. దీంతో గడ్డ కట్టించే శీతాకాలం నుండి వారికి రక్షణ కరువవుతోంది. కప్పుకోవడానికి దుప్పట్లు లేక, మంట వేసుకోవడానికి కర్రలు దొరక్క శిబిరాలు ఛిద్రమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిరుగుల బొంతలా వున్న తాత్కాలిక శిబిరాల్లో పిల్లలకు ఒంటినిండా కప్పడానికి తగినన్ని దుప్పట్లు లేక తల్లుల బాధ వర్ణనాతీతంగా వుందని సహాయ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తాయని, గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేసినపుడల్లా భయపడుతున్నామన్నారు. ఐక్యరాజ్య సమితి ఇప్పటికే ఈ పరిస్థితులపై హెచ్చరికలు జారీ చేసింది. దాదాపు 9,45,000 మందికి శీతాకాలపు సరఫరాలు అవసరమని పేర్కొంది. కానీ ఇవేవీ గాజాలో అందుబాటులో లేవని చెప్పింది.

నాపరాతి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువస్తాం

- మంత్రి బిసి జనార్థన్ రెడ్డి
- నాపరాతి కార్మికులు, గనుల యజమానుల దీక్షకు సంఘీభావం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

నాపరాతి గనుల యజమానులు, కార్మికుల సమస్యలు, ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, నాపరాతి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవననాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. మైనింగ్ అధికారులు నాపరాళ్లపై విధించిన కన్సిడరేషన్ రుసుమును తొలగించాలని నాపరాతి కార్మికులు, గనుల యజమానులు, ఫ్యాక్టరీ యజమానులు, ట్రాక్టర్, లారీ యజమానులు, డ్రైవర్లు కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లి చెక్ పోస్ట్ వద్ద గత ఐదు రోజులుగా చేస్తున్న నిరాహార దీక్ష చేపడుతున్నారు. సోమవారం దీక్షా శిబిరాన్ని మంత్రి సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. రాయలసీమ మినరల్స్ అసోసియేషన్ సభ్యులు మంత్రి బిసి జనార్దన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ...వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్లే నేడు పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు గురవుతోందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కూడా రాయిల్టీని, డిఎంఎఫ్‌ను పెంచితే నాడు పట్టుబట్టి ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు తామంతా పోరాటం చేసి విజయం సాధించామన్నారు. తాను ప్రతి అంశంలోనూ పేదలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గనుల యజమానులు కూడా ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అలా కాకుండా నేడు గనుల యజమానులు రాయిల్టీ మూడు టన్నులకు తీసుకుని, దాదాపు ఎనిమిది టన్నుల వరకు అదనంగా తీసుకువెళ్లడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న విషయం గుర్తించాలన్నారు. గనుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, గనుల శాఖ మంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని, త్వరలో పరిష్కారం లభిస్తుందన్నారు.

FORM NO.14
{See Regulation 33(2)}

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
31-31-21, Narayana Bhavanam,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/183/2023 **13.12.2024**

Canara Bank, Governorpeta Branch, Vijayawada, Krishna District.
Versus
M/s V.S.U.G Biotics & others

To
(CD-1) M/s V.S.U.G Biotics, Rep. by its Managing partner Sri. Gone Venkata Subba Rao, D No. 23-3-21, Narravari Street, Satyanarayanapuram, Vijayawada, Krishna District-520011.
(CD-2) Sri. Gone Venkata Subba Rao, S/o Sri. Narasaiah, D No. 23-3-21, Narravari Street, Satyanarayanapuram, Vijayawada, Krishna District-520011.
(CD-3) Sri. Yajja Vara Suryanarayana, S/o Sri. Venkata Rama Rao, D No. 25-18-42, Sampath Nagar, Guntur District-522204.
(CD-4) Sri. Parasa Sujeev Kumar, S/o Sri. Sujan Raju, D No. 5-55-81, Flat No. 2, Rohini Homes Apartment, 4/18-1 Lain, Brodipet, Guntur District-522202.
(CD-5) Smt. Samudrala Vijaya Kumari, W/o Sri. Sujan Raju, D No. 5-55-81, Flat No. 2, Rohini Homes Apartment, 4/18-1 Lain, Brodipet, Guntur District-522202.

1) This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/60/2017** an amount of **Rs. 98,11,240/- (Rupees ninety eight lakhs eleven thousand two hundred and forty only)** along with pendentallite and future interest @ 9.60% p.a compounded with monthly rests from 09.01.2017 till realization / date of payment and the costs become due against you (Jointly and severally /Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **27.01.2025** at **10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay :
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
6. Attention is invited to **Rule 16** of the Second Schedule to the Income Tax Act, 1961 which is reproduced below:
16(1) Where a notice has been served on a defaulter under Rule 2, the defaulter or his representative in interest shall not be competent to mortgage, charge, lease or otherwise deal with any property belonging to him except with the permission of the Recovery Officer, nor shall any Civil Court issue any process against such property in execution of a decree for the payment of money.
16(2) Where an attachment has been made under this Schedule, any private transfer or delivery of the property attached or of any interest therein and any payment to the defaulter of any debt, dividend or other moneys contrary to such attachment shall be void as against all claims enforceable under the attachment.

(Given under my hand and the seal of the Tribunal at Visakhapatnam on this day 13th December, 2024)

(Avasarala Anil) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

Union Bank of India
అసెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్ ఆర్ అప్పారావు వీధి, విజయవాడ, ఎ.పి.-520001,
Email: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
RULE 6 (2)/8 (6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీతలు: 1) మెస్సర్స్ కావేరి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, [illegible]

షెడ్యూల్ ఆస్తి

[illegible]

తేది : 16-12-2024
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ,
4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, కంచికచర్ల, పరిటాల గ్రామం, విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్ళే హైవే రోడ్డు ప్రక్కన, ఎల్.పి నెం.30/03, ప్లాట్ నెం. 42 డోర్ నెం.1-152 దగ్గర, ఆర్.ఎస్ నెం.768/3ఎ నందలి **శ్రీమతి సృజన లత రాచప్రోలుకు** చెందిన 626.66 చ॥గ॥ల నివాస ఖాళీ ఇంటి ప్లాటుకు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం.43, **దక్షిణం:** ప్లాట్ నెం.41; **తూర్పు:** పిడబ్ల్యూడి భూమి, **పడమర:** 40అ॥ల వెడల్పు గల రోడ్డు.

స్థలం : విజయవాడ
తేది : 20-12-2024
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, లీగల్ డిపార్టుమెంట్, నం. 145, సంతోమె హై రోడ్, (3వ అంతస్తు), మైలాపూర్, చెన్నై 600 004. ఫోన్: 044-4606 8200.

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు మెసర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైనప్పటి నుండి) యొక్క అధీకృత అధికారిగా [illegible]

తేది: 19.12.2024.
అధీకృత అధికారి & వైస్ ప్రెసిడెంట్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్-సెక్యూర్డ్ క్రెడిట్.

శ్యామ్ బెనెగల్ ప్రస్థానం

హైదరాబాద్‌లో జననం, విద్యాభ్యాసం

శ్యామ్ బెనెగల్‌గా ప్రఖ్యాతిగాంచిన బెనగళ్ల శ్యామ్‌సుందరరావు హైదరాబాద్‌లోని తిరుమలగిరిలో 1934 డిసెంబర్ 14న జన్మించారు. సికింద్రాబాద్ మహబూబ్ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. ఉస్మానియా వర్సిటీ నుంచి ఆర్థికశాస్త్రంలో ఎంఎ పట్టా అందుకున్నారు. చిన్నప్పట్నుంచే సినిమాల పట్ల ఆసక్తిని పెంచుకున్న శ్యామ్ బెనెగల్.. 1959లో ముంబయిలో ఓ యాడ్ ఏజెన్సీలో కాపీరైటర్‌గా పనిచేశారు. తరువాత మరో సంస్థలో క్రియేటివ్ హెడ్‌గా కొనసాగారు. 1962లో తొలి డాక్యుమెంటరీ (గుజరాతీ) రూపొందించారు. దశాబ్దం తర్వాత ఫీచర్ ఫిల్మ్‌ను ఆయన తెరకెక్కించారు. అలా.. సినీరంగంలో అంచెలంచెలుగా ఎదిగి గొప్ప చిత్రాలు తీయడం ద్వారా ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. సినీ రంగంలో తన అపూర్వ సేవలకు గాను 1976లో పద్మశ్రీ, 1991లో పద్మభూషణ్, 2003లో ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత పురస్కారం, 2013లో ఎఎన్ఆర్ జాతీయ అవార్డు, ఎనిమిది సార్లు జాతీయ అవార్డులు అందుకున్నారు.

ఫొటోగ్రఫీపై ఆసక్తి

శ్యామ్ బెనెగల్ తండ్రి శ్రీధర్ బి. బెనెగల్ ఛాయాచిత్రకారుడు. ఆ ఛాయల్లో పెరగడం వల్ల శ్యామ్ బెనెగల్‌కు ఫొటోగ్రఫీ అంటే ఎనలేని మక్కువ. పుట్టినరోజు నాడు తన తండ్రి బహూకరించిన మూవీ కెమెరాతో ముచ్చట తీర్చుకునేవారు. ఆ కెమెరాతోనే భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారు. చదువుకున్న రోజుల్లో విపరీతంగా సినిమాలు చూసేవారు. ఆ అభిరుచితోనే ఫిల్మ్ సొసైటీ స్థాపించారు. ఉద్యోగం కోసం ముంబయి వెళ్లిన ఆయన తక్కువ నిడివితో ప్రకటనలు రూపొందించే వారు. అంధకారంలో అలమటిస్తున్న అభాగ్య బాల కార్మికుల దైన్యస్థితి చూసి చలించి 'ఏ చైల్డ్ ఆఫ్ ది స్ట్రీట్స్' డాక్యుమెంటరీ రూపొందించారు. తన కెరీర్‌నే మార్చిన మలుపు అది. తొలి ఉద్యోగంలో పురోగతి కనిపించకపోవడంతో మరో యాడ్ కంపెనీలో చేరారు. ఓ ఫెలోషిప్ సాయంతో విదేశాలు వెళ్లి, చిత్ర నిర్మాణంలో మెళకువలు నేర్చుకున్నారు. వాస్తవిక చిత్రాల ఔన్నత్యాన్ని గుర్తించారు. స్వదేశానికి తిరిగొచ్చాక 'అంకుర్'ని తెరకెక్కించారు. 'వాణిజ్య ప్రకటన ద్వారా సినిమా నిర్మాణం నేర్చుకున్నా. చిత్రాలు తెరకెక్కించడంలో ఎవరి ప్రభావం నాపై ఉండకూడదనే ఉద్దేశంతోనే ఎక్కడా సహాయ దర్శకుడిగా పని చేయలేదు' అని ఓ సందర్భంలో శ్యామ్ బెనెగల్ స్వయంగా చెప్పారు.

ప్రతి సినిమాకీ అవార్డు..

శ్యామ్ బెనెగల్ యదార్థవాది. ముఖ్యంగా వ్యదార్థ జీవుల యదార్థగాథలకు దృశ్యరూపం ఇచ్చారు. దీంతో ఆయన ప్రతీ సినిమా అవార్డు అందుకుంది. 'నిషాంత్', 'మంథన్', 'భూమిక', 'సమర్', 'హరి- భరీ', 'మండి'.. ఇలా బెనెగల్ దర్శకత్వం వహించిన దాదాపు అన్ని సినిమాలూ అవార్డులు దక్కించుకోవడం విశేషం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చివరి చిత్రం 'ముజిబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్' గతేడాది విడుదలైంది. అలాగే, పలు లఘు చిత్రాలు, ధారా వాహికలకూ బెనెగల్ దర్శకత్వం వహించి తనదైన ముద్ర వేశారు. ఒక సినిమా కోసం స్టార్లను ఎంపిక చేసుకున్న ఆయన.. అదే తాను చేసిన పెద్ద పొరపాటు అని ఓ సందర్భంలో అన్నారు.

తొలి క్రౌడ్ ఫండింగ్ సినిమా

దేశంలో పాల ఉత్పత్తిని పెంచడంలో విశేష కృషి చేసి, శ్వేత విప్లవ పితామహుడిగా పేరొందిన వర్గీస్ కురియన్ జీవిత కథ ఆధారంగా బెనెగల్ తెరకెక్కించిన చిత్రం 'మంథన్'. ఈ సినిమా నిర్మాణానికి రైతులు భాగస్వామ్యం వహించాలనే శ్యామ్ బెనెగల్ ఆలోచనకు గుజరాత్ కో ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ ముందుకొచ్చింది. దీంతో ఈ ఫెడరేషన్‌లో భాగస్వాములుగా ఉన్న 5 లక్షల మంది రైతులు రూ.2 చొప్పున ఇచ్చారు. ప్రపంచంలో ఇంత ఎక్కువమంది నిర్మించిన తొలి క్రౌండ్ ఫండింగ్ సినిమాగా 'మంథన్' రికార్డు సృష్టించింది. మన దేశంలో ఇదే తొలి క్రౌడ్ ఫండింగ్ సినిమాగా చరిత్రలో నిలిచిపోయింది.

శ్యామ్ బెనెగల్ మృతికి సిపిఎం ప్రగాఢ సంతాపం

అసాధారణ సినీ నిర్మాత శ్యామ్ బెనెగల్ మృతికి సిపిఎం తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. సమాజిక వాస్తవాలను సాహసోపేతమైన రీతిలో తీశారు. లౌకిక విలువల పట్ల తిరుగులేని నిబద్ధత కలిగి వుండడమే కాదు, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాడు. మానవత్వం, మానవాళి పట్ల అత్యంత వినమ్రంగా ఉండేవాడు. ఆయన తెలివితేటలు అమోఘం. అటువంటి సినీ దిగ్గజానికివే మా జోహార్లు అని ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్‌లో సిపిఎం పేర్కొంది.

కమ్యూనిస్టు యోధ సీతారాం ఏచూరితో సాంస్కృతిక యోధ శ్యామ్‌బెనెగల్

రాష్ట్ర కమిటీ సంతాపం

భారతీయ సినీ దిగ్గజం, సమాంతర సినిమా ఉద్యమ మార్గ దర్శకుల్లో ఒకరైన శ్యామ్ బెనెగల్ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేశారు. భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఫ్యూడల్ సంస్కృతి, కులం, మహిళా విముక్తి వంటి సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని చిత్రాలు నిర్మించడంలో శ్యామ్‌బెనెగల్ కృషి అనిర్వచనీయమని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌లో పుట్టి భారతీయ సినిమాను కొత్త పుంతలు తొక్కించిన ఆయనకు మార్క్సిస్టు పార్టీ జోహార్లు అర్పిస్తున్నదని తెలిపారు.

కాంగ్రెస్ పెద్దలతో అల్లు అర్జున్ మామ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నటుడు అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి సోమవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పెద్దలతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ, సిడబ్ల్యుసి సభ్యులు కొప్పుల రాజు, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఉన్నారనే సమాచారంతో అయన గాంధీభవన్‌కు వెళ్లారు. ఆ సమయంలో పిసిసి అధ్యక్షుడు మీడియా సమావేశంలో ఉన్నందున దీపాదాస్ మున్షీతో ఆయన సమావేశమయ్యారు. అల్లు అర్జున్ పై కేసు నమోదు, తదితర అంశాలను చంద్రశేఖర్ రెడ్డి మున్షీకి వివరించారు. అనంతరం ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ చంద్రశేఖర్ రెడ్డికి ఫోన్ చేశారు. ఒకట్రెండు రోజుల్లో కూర్చొని అన్ని విషయాలు మాట్లాడుకుందామని మహేశ్ కుమార్ గౌడ్ ఆయనకు హామీ ఇచ్చారు. మీడియా సమావేశం అనంతరం పిసిసి చీఫ్ ఇదే విషయాన్ని స్పష్టంచేశారు.

అల్లు అర్జున్‌కు మళ్లీ నోటీసులు

సంధ్య థియేటర్ కేసుకు సంబంధించి అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు సోమవారం మళ్లీ నోటీసులు అందజేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు చిక్కడపల్లి పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని వారు నోటీసుల్లో పేర్కొన్నారు.

మోహన్ బాబుకు హైకోర్టులో నిరాశ

- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినీ నటుడు మోహన్‌బాబుకు తెలంగాణ హైకోర్టులో నిరాశ ఎదురైంది. విలేకరిపై దాడి కేసులో ఆయన పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. మోహన్‌బాబు అనారోగ్యంతో ఉన్నారని, గుండె, నరాల సంబంధిత సమస్యలు, మతిమరుపుతో బాధపడుతున్నారని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆయన తిరుపతిలో ఉన్నట్లు తెలిపారు. ఇటీవల దుబాయ్‌లో ఉన్న తన మనవడిని కలిసేందుకు మోహన్‌బాబు వెళ్లారని, అనంతరం తిరుపతికి తిరిగొచ్చి విద్యా సంస్థల బాధ్యతలు చూస్తున్నారని వివరించారు. దాడి ఘటనలో ముందస్తు బెయిల్ ఇవ్వొద్దంటూ ఈ సందర్భంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం మోహన్‌బాబు ముందుస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మోహన్‌బాబు ఫాంహౌస్‌లో ఈనెల 10న చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి కేసు నమోదైంది. న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన విలేకరిపై మోహన్‌బాబు దాడి చేశారు. దీంతో సదరు విలేకరి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు మోహన్‌బాబుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. దాని ప్రకారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, అరెస్టు.. తదుపరి దర్యాప్తు చేయకుండా పోలీసులను ఆదేశించాలని మోహన్‌బాబు తన పిటిషన్‌లో కోరారు. దీనికి సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ పిటిషన్‌లపై విచారణ నిర్వహించి తీర్పు ప్రకటించారు. హైకోర్టు తీర్పుతో పహాడీషరీఫ్ పోలీసులు తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

వరుస నష్టాల నుంచి ఉపశమనం

- సెన్సెక్స్ 500 పాయింట్ల పెరుగుదల
- బడ్జెట్ రోజూ ట్రేడింగ్

ముంబయి : గత వారం అన్ని సెషన్లలో భారీ నష్టాలను చవి చూసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు సోమవారం ఎట్టకేలకు ఉపశమనం లభించింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, ఇప్పటికే భారీగా పడిపోయిన సూచీల ధరల నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గ చూపారు. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ 499 పాయింట్లు పెరిగి 78,489కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 166 పాయింట్లు రాణించి రూ.23,753 వద్ద ముగిసింది. దీంతో ఐదు సెషన్ల వరుస నష్టాలకు బ్రేక్ పడినట్లయ్యింది. అమెరికాలో ద్రవ్యోల్బణం కాస్త తగ్గుముఖం పట్టినట్లు గణాంకాలు వెలువడడం ఆసియా సహా భారత మార్కెట్లలోనూ సానుకూల సంకేతాలు మార్కెట్లకు మద్దతును అందించాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో శనివారం అవుతున్నప్పటికీ.. స్టాక్ మార్కెట్లు ట్రేడింగ్ కానున్నాయి. ఈ మేరకు బిఎస్ఇ, ఎన్ఎస్ఇ ప్రకటించాయి. ఉదయం 9 గంటల నుంచి 3.30 గంటల వరకు ఈక్విటీ ట్రేడింగ్, కమొడిటీ ట్రేడింగ్ సాయంత్రం 5 గంటల వరకు జరగనుందని వెల్లడించాయి.

నిరంకుశ ప్రభుత్వంపై రైతన్న ఆగ్రహం

- దేశవ్యాప్తంగా జాతీయ పాలసీ ఫ్రేమ్‌వర్క్ కాపీలు దగ్ధం
- పాలసీ రద్దు చేయాలనిరాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎస్‌కెఎం లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నిరంకుశ, కార్పొరేట్ అనుకూల ఎన్‌డిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ పాలసీ ఫ్రేమ్‌వర్క్ కాపీలు దగ్ధం చేశారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) లేఖ రాసింది. వ్యవసాయ ప్రాథమిక మార్కెట్ కమిటీ (ఎపిఎంసి)లను నిర్వీర్యం చేస్తూ మోడీ సర్కార్ దొడ్డిదారిన తీసుకొచ్చిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలని లేఖలో డిమాండ్ చేసింది. ఎస్‌కెఎం పిలుపులో భాగంగా దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఆందోళనలు, నిరసనలు జరిగాయి. ఫ్రేమ్‌వర్క్ కాపీలను రైతులు దగ్ధం చేశారు. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఒరిస్సా, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ, త్రిపుర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో రైతుల ఆందోళన జరిగింది. హిమాచల్‌ప్రదేశ్ మంచు కురుస్తున్నప్పటికీ ఆందోళన కొనసాగించారు. అలాగే వివిధ రాష్ట్రాల్లో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆందోళన సాగింది. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఆందోళలో ఎఐకెఎస్ నేతలు హన్నన్ మొల్లా, కృష్ణ ప్రసాద్ తదితర కేంద్ర నాయకత్వం పాల్గొన్నారు. రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని, నోయిడా-గ్రేటర్ నోయిడా జైలులో ఉన్న రైతులను విడుదల చేయాలని, జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని రద్దు చేయాలని, తక్షణమే సమన్వయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై తక్షణమే చర్చించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రైతు సంఘాలు కోరాయి.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకుని ప్రధానమంత్రి, హోం మంత్రితో తక్షణమే చర్చలు జరపాలని కోరారు. రైతు నాయకులు దల్లేవాల్‌కు ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే, దానికి పూర్తి బాధ్యత ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీలదేనని రైతులు తీవ్రంగా హెచ్చరించారు.

యుపిఎస్‌సి చీటింగ్ కేసు
పూజా ఖేడ్కర్‌కు ముందస్తు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ : యుపిఎస్‌సి చీటింగ్ కేసులో మాజీ ఐఎస్ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు సోమవారం నిరాకరించింది. అలాగే ఆమెను అరెస్టు చేయకుండా ఆగస్టులో ఇచ్చిన మధ్యంతర రక్షణను కూడా రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. ఖేడ్కర్ నకిలీ పత్రాలను ఉపయోగించి ఐఎఎస్ క్లియర్ చేసినట్లు బలమైన ఆధారాలు ఉన్నాయని.. సర్టిఫికేట్ వెరిఫికేషన్ సమయంలో సమర్పించిన రిజర్వేషన్లకు ఆమె అర్హురాలు కాదని జస్టిస్ చంద్ర ధరి సింగ్ తెలిపారు. తన చర్యలతో ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పరీక్షల్లో ఒకటైన యుపిఎస్‌సి వ్యవస్థనే తారుమారు చేయడానికి ప్రయత్నించారని..ఇప్పుడు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తును సైతం ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు పరిధిని మరింత విస్తృతం చేయాలని తెలిపారు.

27న ధర్నాలు

- జయప్రదం చేయండి : ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్‌టిఒ కార్యాలయాల్లోనే జారీ చేయాలని కోరుతూ ఈ నెల 27వ తేదీన అన్ని ఆర్‌టిఒ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని అఖిల భారత రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ శివాజీ, ముజఫర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 జనవరి నుంచి డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే వ్యవస్థను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం చేస్తున్న సన్నాహాలు నిలిపివేయాలని కోరారు. ప్రజల భద్రతను కాపాడే రవాణా శాఖ అనేక కొలమానాలతో లైసెన్స్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు జారీ చేస్తోందని, వీటిపై అవగాహన కల్పిస్తోందని చెప్పారు. వీటితోపాటు ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఎన్‌టిఎస్)లను ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారంతో ప్రభుత్వం రవాణా రంగ సర్వీసులను క్రమంగా ప్రైవేటుపరం చేయాలనే దుర్మార్గపు ఆలోచన చేస్తుందన్నారు. ఫలితంగా ప్రజలపై పన్నులు, ఛార్జీల రూపంలో భారాలు వేయనున్నారని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 27న ఆర్‌టిఒ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలో ఆటో, లారీ, అన్ని రకాల ట్రాన్స్‌పోర్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వడ్డీ 28 వేల కోట్లపైనే!

- తలపట్టుకుంటున్న ఆర్థికశాఖ
- 9 ఏళ్లలో మూడింతలైన భారం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అప్పులకు చెల్లించాల్సిన వడ్డీ రాష్ట్ర ఖజానాకు భారంగా మారుతోంది. ప్రస్తుతం రాష్ట్ర రుణం 5.62 లక్షల కోట్ల దాటిపోవడంతో ఆ స్థాయిలోనే వడ్డీలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. గడచిన తొమ్మిదేళ్లలో వడ్డీలు ఏకంగా మూడు రెట్లు పెరిగిపోవడంతో అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత మూడేళ్లుగా ప్రతియేటా పాతిక వేల కోట్ల రూపాయలు పైనే వడ్డీలు చెల్లిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2022-23లో రు.25,483 కోట్లు వడ్డీ చెల్లించగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 29,460 కోట్లు, ప్రస్తుత ఏడాది రు.28,795 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. అంతకుముందు 2015-16 ఆర్థిక సంవత్సరంలో కేవలం తొమ్మిది వేల కోట్ల వరకు మాత్రమే వడ్డీలకు చెల్లించాల్సి రాగా, 2016-17లో 12 వేల కోట్లు చెల్లించారు. ఇది ఇప్పుడు తొమ్మిది రెట్లుగా పెరిగి 28 వేల కోట్లు దాటిపోవడం గమనార్హం. 2015లో కేవలం 1,22,605 కోట్లు మాత్రమే రుణంగా, 2016లో 1,47,935 రుణంగా ఉండగా వడ్డీ కూడా అటూ ఇటూగా పది వేల కోట్ల వరకు మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు.

ఆదాయంలో కొంత దాచివేత

ప్రతి నెలా ఖజానాకు సమకూరుతున్న ఆదాయంలో కొంత మొత్తాన్ని వడ్డీ చెల్లింపుల కోసం పక్కనబెడుతున్నారు. నెలకు 2,400 కోట్ల వరకు వడ్డీలకు చెల్లించాల్సి వస్తోంది. దీనికి సకాలంలో చెల్లించకపోతే ఖజానాపై రుణ సంస్థలు, కేంద్ర వత్తిడి కూడా పెరుగుతుంది. ఇది కొత్త రుణాలు తీసుకోవడంపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని అధికారులు అంటున్నారు.

ట్రంప్ ప్రధాన ఆర్థిక సలహాదారుగా స్టీఫెన్ మిరాన్

వాషింగ్టన్ : ఆర్థికవేత్త స్టీఫెన్ మిరాన్‌ను వైట్‌హౌస్ ఆర్థిక సలహాదారుల మండలి డైరెక్టర్‌గా నియమించనున్నట్లు అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ నెట్‌వర్క్‌లో పోస్టు పెట్టారు. బైడెన్ ప్రభుత్వ ఆర్థిక విధానాలను తీవ్రంగా విమర్శించే మిరాన్ ప్రస్తుతం కన్జర్వేటివ్ థింక్ ట్యాంక్ మన్‌హటన్ ఇన్‌స్టిట్యూట్ సభ్యులుగా వున్నారు. అమెరికన్ల జీవితాల అభ్యున్నతికి కృషి చేసే ఆర్థిక బృంద సభ్యులతో కలిసి స్టీఫెన్ మిరాన్ పనిచేస్తారని ఆయన తెలిపారు. కాగా ట్రంప్ తనను ఈ పదవికి ఎంపిక చేయడం తనకెంతో గౌరవమని మిరాన్ వ్యాఖ్యానించారు. ప్రజాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ అధ్యక్షుడి విధాన ఎజెండాను అమలు చేయడానికి కృషి చేయడానికి తాను కూడా ఎదురుచూస్తున్నట్లు మిరాన్ చెప్పారు. ట్రంప్ మొదటి పదవీ కాలంలో కూడా మిరాన్ ఆర్థిక వ్యవహారాల సీనియర్ సలహాదారుగా పనిచేశారు.

షేక్ హసీనాను అప్పగించండి..

- భారత్‌కు బంగ్లాదేశ్ లేఖ

ఢాకా: మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని భారత్‌ను బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం కోరింది. ఇందుకోసం భారత్‌కు ఒక నోట్‌ను పంపింది. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారులు తౌహిద్ హుస్సేన్ సోమవారం వెల్లడించారు. ఆమెపై కేసులను న్యాయ ప్రక్రియలో విచారించేందుకు ఆమెను తిరిగి తీసుకురావాలని బంగ్లాదేశ్ కోరుకుంటుందని, ఇదే విషయంపై భారత ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాశామని తెలిపారు. భారత్‌తో తమకు అప్పగింత ఒప్పందం ఉందనే విషయాన్ని గుర్తు చేశారు. అలాగే, మరోవైపు బంగ్లాదేశ్ హోంశాఖ కూడా హసీనాను స్వదేశం రప్పించేందుకు చర్యలు ప్రారంభించింది. అవసరమైన చర్యలు చేపట్టాలని విదేశాంగ శాఖకు లేఖ రాశామని, ఆ ప్రక్రియ కొనసాగుతోందని హోంశాఖ సలహాదారు జహంగీర్ ఆలమ్ వెల్లడించారు. వ్యక్తుల అప్పగింతకు సంబంధించి భారత్-బంగ్లాదేశ్ మధ్య ఒప్పందం ఉందని, దీని ప్రకారం హసీనాను స్వదేశానికి తిరిగి తీసుకురావచ్చని చెప్పారు.



బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ఆగస్టు 5న దేశం వీడిన షేక్ హసీనా.. భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో ఉన్న నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. హసీనాపై అక్టోబర్‌లోనే అరెస్టు వారెంట్ జారీ అయింది.

కాగా, షేక్ హసీనాను అప్పగించాలంటూ బంగ్లాదేశ్ లేఖ రాసిన విషయాన్ని భారత్ ధ్రువీకరించింది. అయితే, తదుపరి దీనిపై స్పందించేందుకు నిరాకరించింది. "షేక్ హసీనా అప్పగింతకు సంబంధించి బంగ్లాదేశ్ హై కమిషన్ నుంచి లేఖ అందింది. ప్రస్తుత పరిస్థితుల్లో దీనిపై ఎటువంటి వ్యాఖ్య చేయలేము" అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు.

డబ్ల్యుహెచ్‌ఓ నుండి అమెరికా అవుట్!

- తెంపరి ట్రంప్ సంకేతాలు
- నిపుణుల ఆందోళన

లండన్ : ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) నుండి అమెరికా వైదొలగడానికి డొనాల్డ్ ట్రంప్ బృందం చర్యలు చేపట్టడం పట్ల ఆరోగ్య రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థపై ఇది వినాశకర ప్రభావం చూపుతుందని వారు హెచ్చరించారు. ట్రంప్ బృంద సభ్యులు తమ ఆలోచనల గురించి నిపుణులకు తెలియచేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. జనవరి 20న ట్రంప్ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే ఈ నిర్ణయాన్ని ప్రకటించాలని భావిస్తున్నట్లు బృంద సభ్యులు చెప్పారు. ఇదే గనుక జరిగితే డబ్ల్యుహెచ్‌ఓకు పెద్ద మొత్తంలో నిధులు అందే ఒక మార్గం రద్దవుతుందన్నారు. కరోనా వైరస్ వంటి మహమ్మారులు తలెత్తినపుడు నెలకొనే ప్రజారోగ్య సంక్షోభాలను సమర్ధవంతంగా ఎదుర్కొనే సామర్ధ్యం దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిధుల కొరత తీవ్రంగా వుండనున్నందున డబ్ల్యుహెచ్‌ఓ తన శాస్త్రీయ బృందాన్ని గణనీయంగా తగ్గించుకోవాల్సి వస్తుందని జార్జిటౌన్ లా ప్రొఫెసర్ గాస్టిన్ హెచ్చరించారు.

నేటి నుండి అమెరికాలో జై శంకర్ పర్యటన

కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్ మంగళవారం అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు. 24 నుండి 29 వరకు ఆరు రోజుల పాటు జరిపే ఈ పర్యటనలో కాన్సుల్ జనరల్స్ ఆఫ్ ఇండియా సమావేశానికి హాజరవుతారు. అమెరికా విదేశాంగ మంత్రితో కీలకమైన ద్వైపాక్షిక, ప్రాంతీయ,అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరుపుతారు. ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత జై శంకర్ జరుపుతున్న తొలి పర్యటన ఇది. అధ్యక్ష ఎన్నికల ఫలితాలేవైనా వాటితో నిమిత్తం లేకుండా రెండు దేశాల మధ్య సంబంధాలు వృద్ధి చెందుతాయని జై శంకర్ గతంలో వ్యాఖ్యానించారు.

సిపిఎం మధ్యప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా జస్వీందర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం మధ్యప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా జస్వీందర్ సింగ్ తిరిగి ఎన్నికయ్యారు. 30 మందితో రాష్ట్ర కమిటీని కూడా సోమవారం ఎన్నిక అయింది. 11 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నిక అయింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లాలోని బిఆర్ అంబేద్కర్ స్వగ్రామం మాహులో జరిగిన సిపిఎం మధ్యప్రదేశ్ రాష్ట్ర మహాసభ ముగిసింది. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ సవాళ్లను వివరించి, వాటిని ఎదుర్కొనేందుకు పార్టీ, వామపక్షాల బలాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆర్ఎస్ఎస్, బిజెపి దాడుల నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్ రాజకీయ, సంస్థాగత అంశాలను నొక్కి చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి జస్వీందర్ సింగ్ రాజకీయ, సంస్థాగత నివేదికను ప్రవేశపెట్టారు. 26 జిల్లాల నుంచి 198 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. నివేదికపై జరిగిన చర్చలో 47 మంది పాల్గొన్నారు. అనంతరం నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎనిమిది తీర్మానాలను కూడా మహాసభ ఆమోదించింది.

సిపిఎం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కార్యదర్శిగా బాల్‌సింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర నూతన కార్యదర్శిగా బాల్ సింగ్ ఎన్నికయ్యారు. 23 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక అయింది. అలాగే ఆరుగురుతో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నిక అయింది. సిపిఎం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మహాసభ సూరజ్‌పూర్ జిల్లాలోని బిశ్రాంపూర్‌లో జరిగింది. రాష్ట్ర కార్యదర్శిగా ఎంకె నంది రాజకీయ, నిర్మాణ నివేదికను మహాసభలో ప్రవేశపెట్టారు. ఈ నివేదికను ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు రామచంద్ర డోమ్, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు జోగేంద్ర శర్మ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. మహిళలు, బాలికలపై అణచివేతకు వ్యతిరేకంగా, దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులకు వ్యతిరేకంగా, మతతత్వానికి వ్యతిరేకంగా, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా, ఒకే దేశం ఒకే ఎన్నికలు అనే ఐదు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. రాష్ట్ర కార్యదర్శిగా ఎంకె నంది రిలీవ్ అయ్యారు. నూతన కార్యదర్శిగా బాల్ సింగ్ ఎన్నిక అయ్యారు. గిరిజన నాయకుడైన బాల్‌సింగ్ మెరుగైన పరిస్థితులు, న్యాయమైన వేతనాలు, సామాజిక న్యాయం కోసం స్థానిక కార్మికులు, రైతులు,గిరిజనలను సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

యుపిలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఖలిస్థానీ ఉగ్రవాదులు మృతి

లక్నో : ఉత్తర్‌ప్రదేశ్‌లో సోమవారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఖలిస్థానీ ఉగ్రవాదులు మరణించారు. పిలిభిత్ ప్రాంతంలోని పురానాపుర్ ప్రాంతంలో కొంత మంది అనుమాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఉత్తరప్రదేశ్, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు ప్రారంభించారు. ఈ సమయంలోనే ఈ ఎన్‌కౌంటర్ సంభవించినట్లు అధికారులు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. కానీ ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుందని చెప్పారు. సిబ్బంది ఈ కాల్పుల్లో గుర్వీందర్ సింగ్, వీరేంద్ర సింగ్, జసన్‌ప్రీత్ సింగ్ గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించామని, వీరు అక్కడ చికిత్స పొందుతూ వారు మృతిచెందినట్లు పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు. కాగా, మృతి చెందినవారు ఇటీవల పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలోని కలనౌర్‌లోని బక్షివాలా పోలీస్‌స్టేషన్‌పై గ్రెనేడ్ దాడి చేసిన కేసులో నిందితులని చెప్పారు. నిందితుల నుంచి ఏకే రైఫిల్స్, పిస్టళ్లు స్వాధీనం చేసుకున్నారు.

అమిత్ షా రాజీనామా కోరుతూ 30న దేశవ్యాపితంగా నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

కుదించడం అధికార కేంద్రీకరణ దిశగా తీసుకున్న చర్య అని, ఇది ప్రజల అభిమతానికి విరుద్ధమని వారు విమర్శించారు.రాష్ట్ర శాసన సభల అయిదేళ్ల పదవీ కాల పరిమితిని కుదించడమేనని అన్నారు. ఒక దేశం, ఒక ఎన్నిక ప్రతిపాదనకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం నిర్వహించాలని కూడా వామపక్షాలు నిర్ణయించాయి. ఎన్నికల నిర్వహణ నిబంధనలకు తీసుకొచ్చిన సవరణను కూడా ఉపసంహరించుకోవాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. సిసిటివి కెమెరా, వీడియో ఫుటేజ్ వంటి ఎలక్ట్రానిక్ రికార్డులను బహిరంగంగా తనిఖీ చేయడానికి గల హక్కును ఈ సవరణతో రద్దు చేశారని వామపక్ష పార్టీలు విమర్శించాయి.

రానున్న రోజుల్లో రాజకీయ, ప్రజా సమస్యలపై వామపక్షాల జోక్యాన్ని, పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశం నిర్ణయించింది. ఇందుకోసం, వామపక్షాల విధానాల రూపకల్పన, సంయుక్త కార్యాచరణల కోసం వామపక్షాలు క్రమం తప్పకుండా సమావేశమవాలని కూడా నేతలు నిర్ణయించారు.

ఐదేళ్లలో సమగ్ర అమరావతి

(మొదటిపేజీ తరువాయి)

చూసుకుంటోంది. కేంద్రం నుండి మొదటిదశలో రూ.15 వేల కోట్లు వస్తున్నాయి. ఇంకా వచ్చే అవకాశం ఉంది. రాజధానిలో పనులు పూర్తి చేసేందుకు సుమారు రూ.50 వేల కోట్లకుపైడి ఖర్చు అవ్వొచ్చని గతంలో అంచనాలు వేశారు. ఇప్పుడు విలువ ఇంకొంచెం పెరగొచ్చు. అయినా పనులు ఆగే పరిస్థితి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మరో మూడేళ్లలో రాజధాని సమగ్ర రూపం కనిపిస్తుంది.

ప్ర : పశ్చిమ జాతీయ రహదారి నిర్మాణంతో మాస్టర్‌ప్లానుకు ఏర్పడిన ఇబ్బందిని ఎలా పరిష్కరిస్తున్నారు ?

జ : జాతీయ రహదారికి ప్లాను వచ్చిన సమయంలో మాస్టర్‌ప్లానును పరిగణనలోకి తీసుకోకుండా అన్ని రకాల అనుమతులూ ఇచ్చేశారు. దీనివల్ల మాస్టర్‌ప్లానులో పేర్కొన్న ఆరు, ఏడు రోడ్లకు కనెక్టివిటీ కట్ అయింది. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్రానికి లేఖ రాసింది. వీటిని పరిశీలించిన కేంద్రం ఆరుచోట్ల ప్రధాన రహదారులకు అండర్‌పాస్‌లు నిర్మించేందుకు అంగీకరించింది. పనులు ప్రారంభం అవుతున్నాయి. దీనివల్ల మాస్టర్‌ప్లాను యథావిధిగా అమలవుతుంది. ప్రస్తుతానికి అమరావతి నగరానికి పశ్చిమ బైపాస్ నుండి ప్రధాన కనెక్టివిటీ ఇవ్వాలని నిర్ణయించాము. ఈ పనులు పూర్తయితే అన్ని విధాలా కనెక్టివిటీ ఏర్పడుతుంది. మొత్తంగా అమరావతికి సంబంధించి కృష్ణానదిపై ఇప్పుడున్నవి కాకుండా ఆరు వంతెనలు వస్తాయి. ఇబ్రహీంపట్నం వద్ద ఐకానిక్ బ్రిడ్జిని నిర్మిస్తాము.

ప్ర: ఆర్థికాభివృద్ధికి ఏమైనా చర్యలు తీసుకున్నారా ?

జ : ప్రస్తుతం సదుపాయాల కల్పనపై దృష్టి సారించాము. అమరావతి స్వయంగా ఆర్థికంగా ఎదగగలిగే అవకాశం ఉన్న నగరం. సదుపాయాల కల్పనకు నిధుల అవసరం ఉన్న నేపథ్యంలో వేర్వేరు ఆర్థిక సంస్థల నుండి తీసుకుంటున్నాం. క్రమ పద్ధతిలో వాటిని చెల్లించాల్సి ఉంటుంది. అది ఏమిటనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉంది. కానీ అమరావతి అభివృద్ధి కోసం శాయశక్తుల కష్టపడి పనిచేస్తున్నాం.



మీకోసం

కొద్దిగా నిమ్మరసం, గుడ్డులోని తెల్లసొన కలిపి, తలకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేస్తే జుట్టు బాగా పెరగడమే కాకుండా, ఎంతో మృదువుగా ఉంటుంది.

జీవన సౌరభం

జీవితమంటే నిన్ను నీవు వెతుక్కోవడం కాదు.. నిన్ను నీవు సృష్టించుకోవడం లేదా మలచుకోవడం.

తోక ముడుచు

'**తా**తయ్యా! తుఫాను కారణంగా ఈరోజు మా పాఠశాలకు సెలవు ఇచ్చారు. ఏం చెయ్యాలో తోచలేదు కథ చెప్పవా' అని అడిగింది మనవరాలు శ్రీకాత్యాయని. 'సరే' నువ్వు అల్లరి పనులు మాని బుద్ధిగా కూర్చుంటే చెపుతాను' అని కథ మొదలుపెట్టాడు కాశీతాత.

పూర్వం చిత్రకూట పర్వతం దగ్గర పెద్ద అడవి ఉండేది. ఆ అడవిలో అనేక జంతువులు, పక్షులు, పాములు, తేనె టీగలు హాయిగా జీవిస్తూ ఉండేవి. తేనెటీగలు ఎంతో కష్టపడి తేనెను సేకరించి పెద్ద పెద్ద తేనెపట్లు పెట్టేవి. ఒక రోజు ఆ తేనెను దొంగిలించడం కోసం కొంతమంది వ్యక్తులు కాగడాలు పట్టుకుని అడవికి బయలుదేరారు. వీరి రాకను గమనించిన గూఢచారి తేనెటీగ, దొంగల రాక గురించి మిగిలినవాటికి తెలియచేసింది. వేటగాళ్లు అడవిలోకి వచ్చేసరికి తేనెటీగలన్నీ కలిసి వారి మీద దాడిచేసాయి. దొరికిన చోటల్లా కుట్టసాగాయి. ఆ బాధ భరించలేక తేనె కోసం వచ్చిన దొంగలు తోకముడుచుకుని పలాయనం చిత్తగించారు' అని కథ ముగించాడు కాశీతాత.

'తేనె కోసం వచ్చిన దొంగలకు తోకలున్నాయా తాతయ్యా!' అని అమాయకంగా అడిగింది మనవరాలు. 'తోక ముడవడం అంటే పారిపోవడం అని అర్థం. ఇది ఒక పలుకుబడి. ఏదైనా తగువులో కానీ, యుద్ధంలో కానీ, ఆటలో కానీ, పందెంలో కానీ ఓటమి చవిచూసినప్పుడు వాడే జాతీయం ఇది. కుక్కలు ఒక ప్రదేశం నుండి వేరొక ప్రదేశానికి ఆహార నిమిత్తం వెళ్ళినప్పుడు స్థానికంగా ఉన్న కుక్కలు వాటి మీద తిరుగుబాటు చేస్తాయి. అలాంటప్పుడు కొత్తగా వచ్చిన కుక్కలు స్థానికంగా ఉన్న వాటిని ఎదిరించలేక, భయపడి తోక కిందకు ముడిచి పలాయనం చిత్తగిస్తాయి. అలా ఓడిపోయి, పారిపోయిన సందర్భంలో ఈ జాతీయం వాడుకలోకి వచ్చింది' అని వివరించాడు కాశీతాత.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

దారి చూపండి



పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న క్రిస్మస్ ట్రీలో చివరి బాల్ పెట్టాలి. కాస్త దానికి దారి చూపరూ.

నేను గీసిన బొమ్మ

స.ప్రణయ్ కుమార్,
7వ తరగతి,
వి.ఎస్.ఎన్.సిద్ధార్థ,
పీలేరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మేలుకో ! వినియోగదారుడా !

నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

–టి.రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, గుడివాడ, కృష్ణాజిల్లా.
సెల్ : 9398155749.

ఓ హోటల్ నుంచి ఆర్డర్ పెట్టగా వేడి వేడిగా బిర్యానీతోపాటుగా ఆహార పదార్థాలు వచ్చాయి. తీరా ప్యాకెట్ తెరిచి చూస్తే చికెన్ జాయింట్లపైన విపరీతంగా కలర్ రాసి నిగనిగలాడుతూ కనబడుతోంది. బాగా ఆకలిగా ఉన్న వారు ఎంచక్కా భోజనం చేయగా అరగంట సమయంలోనే వాంతులు ప్రారంభమయ్యాయి. ఫుడ్‌పాయిజన్ అయ్యిందని ఆ తర్వాత తెలిసింది. బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, శెనగపప్పులో రాళ్లు, పసుపు, కారంలో ఇటుకులపొడి, కూరగాయలు, పచ్చి బఠానీలకు రసాయనాలు, పాలల్లో పొడులు ఇలా ఏ పదార్థం తీసుకున్నా నేడు మార్కెట్లో దొరికే అన్ని సరుకులూ కల్తీలు, నకిలీల మయంగా ఉంటున్నాయి. ఇలాంటి కల్తీల బండారాన్ని బయట ప్రపంచానికి తెలియజేయడానికి తమ వంతు ప్రయత్నంగా పలు సంస్థలు కృషిచేస్తున్నాయి. వినియోగదారుల రక్షణలో రాష్ట్రవ్యాప్తంగా లీగల్ మెట్రాలజీశాఖ కూడా తనవంతుగా కృషిచేస్తోంది. పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

డిజిటల్ లావాదేవీలతో...

దేశంలో ఎక్కడ ఏ వస్తువు కొన్నా, సేవాలోపం ఉన్నా, నష్టపోయినా మనం నివశించే ప్రాంతం నుంచే ఫిర్యాదు చేయొచ్చు. ఫోన్ చేసి కంప్లయింట్ చేయొచ్చు. ఇది వినియోగదారుడి హక్కు. వినియోగదారుల రక్షణచట్టం మన దేశంలో 1986 డిసెంబర్ 24న అమల్లోకి వచ్చింది. సాంకేతికత పెరగటంతో డిజిటల్ లావాదేవీలు, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు, టెలి మార్కెటింగ్ వంటివి అందుబాటులోకి రావటంతో కేంద్ర ప్రభుత్వం 2020 జులై 20 నుంచి కొత్త చట్టాన్ని తెచ్చింది. ఈ నిబంధనలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలకు కూడా వర్తిస్తాయి. అవగాహన పెంచుకోవటం ద్వారా లాయర్ అవసరం లేకుండా నేరుగా వినియోగదారుడే తాను నివశించే లేదా ఉద్యోగం చేసే ప్రాంతంలో నుంచే ఫిర్యాదు చేయొచ్చు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో కంజ్యూమర్ ప్రొటెక్షన్ కమిషన్లు పనిచేస్తున్నాయి. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్) మొబైల్ యాప్‌లో కూడా బాధితులు ఫిర్యాదు చేయొచ్చు. 1915, 1800114000 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమస్య చెబితే వారు జిల్లా స్థాయి కమిషన్‌కు తెలియజేస్తారు. ఏదైనా వస్తువు కొనేటప్పుడు బిల్లు, రశీదు, ఆన్‌లైన్‌పేమెంట్ చేసిన తర్వాత ఇన్వాయిస్, ఐడిలను భద్రపర్చుకోవాలి. ఎందుకంటే ఫిర్యాదు సమయంలో వాటిని సమర్పించాలి. ప్రభుత్వ శాఖలు కూడా వినియోగదారుల కమిషన్ పరిధిలోకే వస్తాయి.

కొనుగోలు సమయాల్లో

ఐఎస్ఐ మార్కు, అగ్‌మార్క్‌లను గమనించాలి. గ్యారెంటీ, వారెంటీ కార్డులను షాపు యజమాని సంతకం, ముద్రతో సహా తీసుకోవాల్సివుంది. చిన్న వస్తువులను మినహాయిస్తే సాధ్యమైనంత వరకు బిల్లులను అడిగి తీసుకోవడం మంచిది. సమస్య తలెత్తినప్పుడు వినియోగదారుల ఫోరంలో సమర్పించటానికి అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో నష్టపరిహారం పొందే అవకాశం లేని సందర్భాలు కూడా ఉంటాయి. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల నుంచి పొందే సేవలన్నీ వినియోగదారుల చట్టం పరిధిలోకి వస్తాయని తెలుసుకోవాలి. ఒప్పందం ప్రకారం సేవ చేయకపోయినా, వస్తువు నాణ్యతలో లోపం ఉన్నా, చట్టప్రకారం విధులు నిర్వర్తించకపోయినా వినియోగదారుడు వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం కోర్టులను (ఫోరం)ను ఆశ్రయించొచ్చు. అయితే ఉచితంగా పొందే సర్వీసులు ఈ చట్టం పరిధిలోకి రావు. వినియోగదారుడికి రక్షణగా వినియోగదారుల హక్కుల సంఘాలు పనిచేస్తున్నాయి. వస్తువులు లేదా సేవలు అందుబాటు ధరల్లో ఉండి నచ్చితేనే ఎంచుకునే హక్కు వినియోగదారుడికి ఉంది. బలవంతంగా అంటగట్టే ప్రయత్నం చేస్తే నేరమే అవుతుంది.

ప్యాకింగ్ వస్తువుల విషయంలో...

దుకాణాలు, మాల్స్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేటప్పుడు ప్రతి ప్యాకేజీపైన తయారీదారుని పూర్తి చిరునామా, వస్తువు పేరు, నిఖర బరువు, కొలత లేదా నంబరు, తయారుచేయబడిన తేదీ (నెల, సంవత్సరం), గరిష్ట అమ్మకం ధర, కస్టమర్ కేర్ నంబరు, చిరునామా, టెలిఫోన్ నంబరు, ఇమెయిల్ అడ్రస్ వంటివి ముద్రింబడి ఉన్నాయా? లేదా అనేది గమనించాలి. గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పి) కన్నా ఎక్కువ ధరకు అమ్మితే చట్టరీత్యా నేరమవుతుంది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ప్రతి ప్యాకింగ్‌పైనా ఎంఆర్‌పితోపాటుగా యుఎస్‌పి (యూనిట్ సేల్ ప్రైస్) కూడా ముద్రించాల్సివుంది. కేజీలు, గ్రాముల పరిణామంలో ఖచ్చితంగా ముద్రించాలి. లేకపోతే జరిమానాలు విధిస్తారు. తయారుచేసే వారు తప్పనిసరిగా ప్యాకేజ్ లైసెన్సును డిపార్ట్‌మెంట్ వారు ద్వారా పొందాలి. అధీకృత వ్యక్తులే సరుకులు దిగుమతి చేసుకోవాలి. ప్యాకేజీలకు కంట్రీ ఆఫ్ ఆరిజన్ ముద్రించాలి. ప్యాకేజీలపై తయారుదారుడు ముద్రను తొలగించి ధర పెంచేసి కొత్త స్టిక్కర్లు అంటించటం కూడా నేరమే. తయారుదారుడు ముద్రించిన తేదీని కూడా మార్చరాదు.

తూకాల్లో మోసాలు

రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లలో పసిమి (వేస్టేజీ) మట్టి పేరుతో ఒకటి నుంచి మూడు కిలోలు వరకూ అదనంగా ధాన్యాన్ని కమీషన్ వ్యాపారులు తీసుకోవటం నేరమే. బియ్యం, ధాన్యం, విత్తనాలు, ఎరువులు, సిమెంట్ వంటి వాటిని కొనుగోలుదారుని (వినియోగదారుని) ఎదుట తూకం వేసి ఇవ్వాలి. సూపర్ మార్కెట్లలో ప్యాకేజీల్లోని వస్తువుల నికర బరువు పైన ఏదైనా అనుమానం ఉండే కొనుగోలుదారుడు ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌పై సరిచూసుకోవాలి. ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, సినిమా థియేటర్లు, ఎగ్జిబిషన్లు, యాత్రా ప్రదేశాల్లో ప్యాకేజీలకు అదనంగా వసూలు చేసినా నేరమే. ప్రతి తూనిక, కొలతల పరికరాలు, రాళ్లు, వేయింగ్ మెషీన్లకు డిపార్ట్‌మెంట్ వారిచే ముద్ర వేయించి సంబంధిత ధృవ ప్రతాన్ని అందరికీ కనబడేలా ఉంచాలి.

సంభాషణ : యడవల్లి శ్రీనివాసరావు

రంగవల్లి

15 చుక్కలు 8 వచ్చే వరకు(మధ్య చుక్క)

కాసర. లక్ష్మీ సరోజా రెడ్డి,
జంగారెడ్డిగూడెం,
ఏలూరు జిల్లా.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

మాకు సమ్మతమే..



రానున్న రోజుల్లో బెనిఫిట్ షోలు, టికెట్ ధరలు పెంపునకు అనుమతి ఇచ్చేది లేదని తెలంగాణ సర్కారు తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఎగ్జిబిటర్స్ సమావేశం జరిగింది. ఒక్కో సినిమాకు ఒక్కోరకంగా టికెట్ ధరలు పెంచడం వల్ల సగటు ప్రేక్షకుడు ఇబ్బంది పడుతున్నాడని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అభిప్రాయపడింది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీ ఎగ్జిబిటర్లు కూడా స్వాగతించారు. ఏపీ ప్రభుత్వం కూడా దీనిపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. 'కొత్త సినిమా విడుదలైన రెండు, మూడు రోజులు అభిమానులు, కాలేజ్ స్టూడెంట్స్ యువత, మాస్ ఎక్కువగా చూస్తారు. టికెట్ ధరలు పెంచి, వారి నుంచి అత్యధిక వసూళ్లు చేయడం బాధాకరంగా ఉంది. అన్ని సినిమాలకు నిర్ణీత మొత్తంలోనే టికెట్ ధరలు ఉండేలా చూడాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్‌రాజును కోరాం. ఇటీవల విడుదలైన 'పుష్ప' విషయంలో అనేక రకాలుగా ధరలు నిర్ణయించారు. బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లు పెంచవద్దని డిమాండ్ చేస్తున్నాం. సినిమా నిర్మాణ ఖర్చు ఎక్కువ అయిందని రేట్లు పెంచుతున్నట్లు నిర్మాతలు చెబుతున్నారు. కానీ, థియేటర్‌లో ఆక్యుపెన్సీ తగ్గుతోంది. తెలంగాణ నిర్ణయాన్ని ఏపీ ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకొస్తాం' అని సమావేశంలో పాల్గొన్న విజేందర్ రెడ్డి అన్నారు. 'నిర్మాతలను మేం కోరేది ఒక్కటే.. మల్టీప్లెక్స్ సౌకర్యాలకు అనుగుణంగా ధరలు పెంచుకోండి.. మధ్యతరగతి వాళ్లు సింగిల్ స్క్రీన్‌లకు వస్తారు. ఇక్కడ టికెట్ ధర రూ.500 పెడితే ఎవరూ రావటం లేదు. పెంచిన టికెట్ ధరకు సరిపడా సౌకర్యాలు మా దగ్గరలేవు' అని ఎగ్జిబిటర్స్ తమ అభిప్రాయాలను సమావేశంలో పంచుకున్నారు.

'కన్నప్ప' కామిక్ వీడియో విడుదల

మంచు విష్ణు ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు ముఖేశ్‌కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కన్నప్ప'. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ అక్షయ్‌కుమార్, ప్రభాస్, మోహన్‌లాల్, శరత్‌కుమార్, మోహన్‌బాబు, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ తదితరులు నటిస్తున్నారు. ఇటీవల కన్నప్ప కామిక్ బుక్‌ను విడుదల చేశారు. తాజాగా యానిమేటెడ్ సిరీస్‌కు సంబంధించిన తొలి ఎపిసోడ్‌ను విష్ణు సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ సినిమా ఏప్రిల్ 25న విడుదల కానుంది.

ఫేవరెట్‌గా టీమిండియా

- గత రెండు బాక్సింగ్ డే టెస్ట్‌ల్లోనూ గెలుపే
- తనుష్ కోటియన్‌కు పిలుపు

మెల్‌బోర్న్: బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఈనెల 26నుంచి జరిగే బాక్సింగ్ డే టెస్టులో టీమిండియాకు గొప్ప రికార్డు ఉంది. గత రెండు బాక్సింగ్ డే టెస్టుల్లో ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో మరోసారి సత్తా చాటాలని టీమిండియా వేచి చూస్తోంది. 2018లో విరాట్ కోహ్లి నేతృత్వంలో.. బాక్సింగ్ డే టెస్టులో భారత్‌కు తొలిసారి విజయం లభించింది. ఆ టెస్ట్‌నలో టీమిండియా 137 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తుచేసింది. పుజరా(106) సెంచరీకి తోడు కోహ్లి(82) రాణించారు. ఇక 2020లో అజింక్యా రహానె సారథ్యంలో మరోసారి భారత్ సత్తా చాటింది. ఆ టెస్ట్‌లో టీమిండియా 8వికెట్ల తేడాతో కంగారులను చిత్తుచేసింది. ఈ మ్యాచ్‌లో రహానె అద్భుత శతకం(112)కి తోడు జడేజా(57) అర్ధసెంచరీతో మెరిసాడు. ఓవరాల్‌గా మెల్‌బోర్న్‌లో ఆసీస్‌దే పై చేయి. ఈ వేదికపై భారత్ మొత్తం 14 టెస్టులు ఆడగా.. కేవలం నాలుగు, రెండు డ్రాలు, ఎనిమిది అపజయాలు ఉన్నాయి. ఈసారి ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు ఆసీస్ గడ్డపై అడుగిడిన భారత్.. మూడు టెస్టులు ముగిసే సరికి 1–1తో సమంగా ఉంది.

తనుష్ కోటియన్‌కు పిలుపు...

ముంబయి ఆల్‌రౌండర్ తనుష్ కోటియన్ ఆఘ మేఘాలమీద ఆస్ట్రేలియాకు పయనమయ్యాడు. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ మధ్యలో స్పిన్నర్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పడంతో అతని స్థానంలో తనుష్‌కు బిసిసిఐ నుంచి పిలుపు వచ్చింది. విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్–ముంబయి మ్యాచ్ ముగిసిన వెంటనే తనుష్ మెల్‌బోర్న్‌కు బయల్దేరి వెళ్లాడు. 26ఏళ్ల కోటియన్ 33 ఫస్ట్‌క్లాస్ మ్యాచుల్లో 25.70 సగటుతో సహా 101 వికెట్లు పడగొట్టాడు. 47 ఇన్నింగ్స్‌లో 41.21 సగటుతో రెండు సెంచరీలు, 13 అర్ధసెంచరీలతో 1534 పరుగులు చేశాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందు ఆస్ట్రేలియాతో జరిగిన అనధికార టెస్ట్‌లో 44పరుగులు చేసి ఒక వికెట్ పడగొట్టాడు.

కోహ్లి, బుమ్రాలకు అద్భుత రికార్డు..

ప్రతిష్టాత్మక మెల్‌బోర్న్ మైదానంలో టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లి ఆడిన మూడు టెస్టుల్లో 52.66 సగటుతో 316 పరుగులు సాధించాడు. అందులో ఒక సెంచరీ, రెండు అర్ధసెంచరీలు ఉన్నాయి. 2014లో తొలిసారి 169 పరుగులు చేసిన కోహ్లి పేరు ఒక్కసారిగా మార్మోగిపోయింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ 54 పరుగులతో జట్టుకు ఓటమి నుంచి తప్పించాడు. ఇదే మైదానంలో విరాట్.. క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే టి20 ఇన్నింగ్స్ ఆడాడు. రెండేళ్ల కిందట టి20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై ఛేదనలో 53బంతుల్లో 82 పరుగులతో జట్టును గెలిపించిన తీరును అభిమానులను ఎప్పటికీ మరిచిపోలేరు. తనకు అచ్చొచ్చిన పిచ్‌పై మునుపటిలా చెలరేగితే మాత్రం భారత్‌కు తిరుగుండదు. 2018లో మెల్‌బోర్న్ వేదికగా జరిగిన టెస్టులో బుమ్రా (6/33) అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రస్తుత టోర్నీలో జోరు మీదున్న ఈ స్టార్ పేసర్ మరోసారి బంతితో చెలరేగడం ఖాయమే.

'నేను బాగానే ఉన్నా..': కాంబ్లి

ముంబయి: టీమిండియా మాజీ ఆటగాడు వినోద్ కాంబ్లి మళ్లీ ఆసుపత్రిలో చేరాడు. ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం థానేలో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం కాంబ్లీ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు, కానీ ఐసియులోనే వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్ సమస్యలతో ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో మెదడులో రక్తం గడ్డకట్టినట్లు తేలిందని డాక్టర్లు తెలిపారు. అతని ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, మంగళవారం అదనపు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 'తాను బాగానే ఉన్నట్లు..' మాజీ క్రికెటర్ అజయ్ జడేజా తనను ఆసుపత్రిలో కలిసినట్లు, తన 10ఏళ్ల కుమారుడు జీసస్ క్రిస్టియానో తనతో ఉన్నందుకు మిక్కిలి సంతోషంగా ఉన్నట్లు కాంబ్లి ట్విటర్(ఎక్స్)లో తెలిపాడు. దివంగత రమాకాంత్ అచ్రేకర్ కార్యక్రమానికి కాంబ్లి హాజరై.. దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తనకు ఎంతగానో సహాయపడినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే. కాంబ్లీకి సాయం చేసేందుకు 1983 వన్డే ప్రపంచకప్ విజేత జట్టు ఎప్పుడూ సిద్ధంగా ఉందని మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ఇటీవల ప్రకటించాడు.

మరిన్ని థియేటర్లలో 'మార్కో'

ఈ నెల 20న మలయాళంలో విడుదలైన 'మార్కో' సినిమా విశేష ప్రజాదరణ పొందుతోంది. హిందీలోనూ థియేటర్లలో విడుదలై బాగా ఆకట్టుకుంటోంది. ఉన్ని ముకుందన్ టైటిల్ రోల్ ప్లే చేసిన ఈ చిత్రాన్ని హనీఫ్ అదెని దర్శకత్వంలో క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై షరీఫ్ మహ్మద్ నిర్మించారు. తెలుగు రాష్ట్రాల్లో హిందీ వెర్షన్‌కు ఆదరణ లభిస్తోందనీ, మరిన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని జీనీవర్స్ సంస్థ అధినేత బల్వంత్ సింగ్ తెలిపారు. దేశంలో ఇప్పటివరకు బాహుబలి, కెజిఎఫ్, కాంతరా తర్వాత పుష్ప 2, ఇప్పుడు తమ చిత్రం మార్కో గురించి మాట్లాడుకుంటున్నారన్నారు. మంగళవారం నుంచి మరిన్ని థియేటర్లలో విడుదల చేస్తామని పేర్కొన్నారు.

తమిళంలో..

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన '35–చిన్న కథ కాదు' చిత్రం తమిళ్‌లో విడుదలకానుంది. ఈ విషయాన్ని నివేదా థామస్ సోషల్‌మీడియా ద్వారా తెలియజేశారు. 'మేము చెన్నైకి వస్తున్నాము.. మా తెలుగు సినిమా '35– చిన్న కథ కాదు' ఇప్పుడు తమిళంలో మీ ముందుకు రాబోతోంది. లైఫ్ అండ్ మ్యాథమెటిక్స్ అద్భుతమైన ప్రయాణాన్ని అనుభవించడానికి సిద్ధంగా ఉండండి. ఈ క్రిస్‌మస్‌కి థియేటర్‌లో కలుద్దాం!' అని నివేదా పోస్టు చేశారు. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిన్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రానికి నంద కిషోర్ దర్శకత్వం వహించారు.

సినిమాగా 'గరివిడి లక్ష్మి'

'**పీ**పుల్ మీడియా ఫ్యాక్టరీ' బ్యానర్‌లో తాజాగా 'గరివిడి లక్ష్మి' అనే టైటిల్‌తో 48వ చిత్రం రాబోతోంది. గరివిడి లక్ష్మి బుర్రకథ అంటే ఉత్తరాంధ్రలో ఒకప్పుడు విపరీతమైన క్రేజ్ ఉండేది. ఉత్తరాంధ్ర సాంస్కృతిక వారసత్వానికి గణనీయమైన కృషి చేసిన బుర్ర కథ కళాకారిణి లక్ష్మి. ఆమె జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రని ఆనంది పోషించనున్నారు. 'సినిమా బండి' ఫేమ్ రాగ్ మయూర్, నరేష్ వీకే, రాశి, శరణ్య, మీసాల లక్ష్మణ్, అంకిత్ కొయ్యా, కిశోర్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటించనున్నారు. ఈ మూవీని ఆంధ్రప్రదేశ్ లోని ఆదోనిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా టైటిల్ పోస్టర్‌ని కూడా రిలీజ్ చేసారు. సీనియర్ నటుడు నరేష్, ఆనంది, రాగ్ మయూర్, శరణ్య, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వచ్చే ఏడాది జనవరిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి గౌరీ నాయుడు జమ్మూ దర్శకత్వం వహిస్తున్నారు. టీజి విశ్వ ప్రసాద్, ఆయన కుమార్తె టిజి కృతి ప్రసాద్ ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తున్నారు. వివేక్ కూచిబొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి చరణ్ అర్జున్ సంగీతం సమకూరుస్తున్నారు. జె ఆదిత్య సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి.

ఢిల్లీ, పుణేరి గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్–11

పూణే: ప్రొ కబడ్డీ సీజన్ట్–11లో దబాంగ్ ఢిల్లీ, పుణేరి పల్టన్స్ జట్లు విజయాన్ని సొంతం చేసుకున్నాయి. సోమవారం జరిగిన తొలి గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 45–31 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను, రెండో లీగ్ మ్యాచ్‌లో పుణేరి పల్టన్స్ 42–32 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌ను చిత్తుచేశాయి. ఢిల్లీ జట్టులో ఆషు మాలిక్(14), ఆశిశ్(7) రైడ్స్‌లో రాణించగా.. ట్యాకిల్స్‌లో నవీన్, ఆశీశ్ మాలిక్ రాణించారు. ఢిల్లీ జట్టు ఆరుసార్లు ప్రత్యర్ధి జట్టును ఆలౌట్ చేసింది. రైడ్‌ల ద్వారా 24, ట్యాకిల్స్ ద్వారా 12 పాయింట్లు సాధించింది. ఇక గుజరాత్ జట్టులో జితేందర్(7), గుమన్ సింగ్(5) రైడ్స్‌లో రాణించగా.. రాకేశ్, హిమాన్షు ట్యాకిల్స్‌లో మెరిసారు. ఆ జట్టు రెండుసార్లు ఢిల్లీని ఆలౌట్ చేసినా.. రైడ్స్‌లో కేవలం 14పాయింట్లు మాత్రమే కైవసం చేసుకోగల్గింది. ఇక పుణేరి జట్టులో ఆర్యవర్ధన్(10) రైడ్స్‌లో, అజిత్(7) ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు.

ప్రొ కబడ్డీలో నేడు
బెంగళూరు × యుపి
(రాత్రి 8.00గం॥లకు)
బెంగాల్ వారియర్స్ × యు ముంబ
(రాత్రి 9.00గం॥లకు)

హైదరాబాద్ స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ప్రొసిడెక్స్ టెక్నాలజీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దత్త సాయితో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా వివాహం జరిగింది. ఇరువురు కుటుంబ సభ్యులు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరిగింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68